

ఒంగోలులో పొంగళి పెడుతున్న యువతులు

తెలుగువారి పెద్దపండుగ రానే వచ్చింది. జిల్లా అంతటా మకర సంక్రాంతి శోభ నెలకొంది. ఏ లోగిలిలో చూసినా ముత్యాల ముగ్గులు, గొబ్బెమ్మలు, డూడూబసవన్నల ఆటలు, హరిదాసుల కీర్తనలతో సందడి కనిపిస్తోంది. సోమవారం సంక్రాంతిని ఆనందంగా జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. ఇప్పటికే పల్లెలు, పట్టణాల్లో పండుగ కళ ఉట్టిపడుతోంది. ప్రతి ఊరిలో ఏదో కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. ఏవీధికి వెళ్లినా పిండివంటల ఘుమఘుమలు వస్తున్నాయి.

ఊరూరా సంక్రాంతి



గంగిరెద్దు విన్యాసాలు

ఉత్సాహంగా భోగి

నేడు మకర సంక్రాంతి.. రేపు కనుమ

పలుచోట్ల పార్వేట, తెప్పోత్సవాలకు ఏర్పాట్లు

ఒంగోలు (కల్చరల్), జనవరి 14 : 'రావమ్మా మహాలక్ష్మి రావమ్మా..' అంటూ సంక్రాంతి లక్ష్మికి తెలుగు ప్రజలంతా ఘన స్వాగతం పలికే పెద్ద పండుగ సంక్రాంతి. ప్రతి సంవత్సరం జనవరిలో సూర్యుడు మకరరాశిలో ప్రవేశించే రోజు సంక్రాంతి జరుపుకోవడం ఆనవాయితీ. జ్యోతిష్యశాస్త్ర ప్రకారం మనకు 27 నక్షత్రాలు ఉండగా ఒక్కో నక్షత్రానికి నాలుగు పాదాల చొప్పున మొత్తం 108 పాదాలుగా విభజన జరిగింది. ఈ 108 పాదాలను 12 రాశులుగా విభజించారు. సకల సృష్టికి కాంతినిచ్చే సూర్యుడు ఒక్కో నెలలో ఒక్కో రాశిలోకి ప్రవేశిస్తాడు. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించినప్పుడు దానిని 'మకర సంక్రాంతి'గా పిలుస్తారు. అసలు ఈ పండుగ పేరులోనే ఎంతో అర్థం ఉంది. 'సం' అంటే మిక్కిలి అని, 'క్రాంతి' అంటే అభ్యుదయం, జ్ఞానం, వెలుగు అని అనేక అర్థాలు ఉన్నాయి. అంటే మిక్కిలి జ్ఞానాన్ని, వెలుగును ఇచ్చేది 'సంక్రాంతి' అని పెద్దలు చెబుతారు. సోమవారం మకర సంక్రాంతిని ఘనంగా జరుపుకునేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. దూరప్రాంతాలు, ఇతర దేశాల్లో ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిర పడిన వారంతా ఈ ఏడాది భారీగా సొంతూర్లకు చేరుకున్నారు. దీంతో గ్రామాలు కళకళలాడుతున్నాయి. ఆటల పోటీలు, ఎడ్ల బలప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు పెద్దఎత్తున ఏర్పాటు చేశారు.

ఘనంగా భోగి

భోగి పండుగను ఆదివారం వేకువజామున జిల్లావాసులు ఉత్సాహంగా జరుపుకున్నారు. ఇంటిల్లపాది భోగిమంటలు వేశారు. పిల్లలకు భోగిపండ్లు పోశారు. అలాగే వివిధ సంస్థల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం కనుమ సందర్భంగా పలుగ్రామాల్లో తెప్పోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే పార్వేట జరగనుంది. ఒంగోలు గద్దలగుంటపాలెంలో జరిగే పార్వేట ఉత్సవానికి ఎన్నో తరాల చరిత్ర ఉంది. ప్రతి సంవత్సరం ఇక్కడ జరిగే పార్వేటకు వేలాదిగా ప్రజలు తరలివచ్చి, అక్కడకు వచ్చిన వివిధ దేవతామూర్తులను ఎంతో భక్తిగా కొలుస్తారు. చిన్నపెద్దా భేదం లేకుండా సాంస్కృతిక కార్యక్రమాల్లో పాలుపంచుకుని ఆనందడోలికల్లో తేలిపోతారు.



ఒంగోలు గాంధీరోడ్డులో జరిగిన భోగి మంటల వేడుకల్లో పాల్గొన్న మహిళలు



రెక్కలు విప్పిన పందెం

- కత్తులు దూసిన కోళ్లు
- జిల్లావ్యాప్తంగా బరులు
- గవండ్లపాలెంలో కట్టలు తెగిన నోట్లు
- నేడు, రేపు భారీ ఎత్తున నిర్వహణకు ఏర్పాట్లు

ఒంగోలు (క్రైం), జనవరి 14: పందెం కోళ్లు బరిలోకి దిగాయి. కత్తికట్టి కాలు దువ్వాయి. రెక్కలు విప్పి గెలుపు కోసం రక్తం చిందించాయి. రూ.లక్షలు చేతులు మారాయి. ఆదివారం జిల్లాలోని పలుప్రాంతాల్లో కోడిపందాలు జోరుగా సాగాయి. కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మలికగర్గ్ హెచ్చరించినప్పటికీ క్షేత్రస్థాయిలో పోలీసులు పట్టించుకోకపోవడంతో బరులు భారీఎత్తున సాగాయి. కొత్తపట్నం మండలం గవండ్లపాలెంలో ఆదివారం పెద్దఎత్తున కోడి పందేలు జరిగాయి. సుమారు వందకార్లు, వెయ్యికిపైగా మోటారు సైకిళ్లలో పందెం రాయుళ్లు వచ్చారు. రెండు వందల కోళ్లను బరిలోకి దించారు. కొన్ని గంటల్లోనే రూ.లక్షలు చేతులు మారాయి. ఆ ప్రాంతం జాతరను తలపించినా పోలీసులు ఆవైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. సోమవారం కూడా పందేలు కొనసాగనున్నాయి. కొత్తపట్నం మండలం గుండమాల, నాగులుప్పలపాడు మండలం కనపర్తి, మండల కేంద్రమైన సంతనూతలపాడు, మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడు, సింగరాయకొండ పాకల వద్ద బరులు సిద్ధమయ్యాయి. సోమ, మంగళవారాల్లో అక్కడ పెద్దఎత్తున పందేలకు ఏర్పాట్లు చేశారు.



పోటీలకు హాజరైన జనం

జగన్ సరికొత్త నాటకం

నాయకులకు ప్రాధాన్యం తగ్గించటం, విడదీయటమే లక్ష్యం

ముందు బాలినేని, మాగుంటలను దూరంగా ఉంచారు

ఇప్పుడు ఇద్దరి మధ్య సఖ్యత బ్రేక్‌కు యత్నం

కందుకూరు విషయంలోనూ అదే డ్రామా

మార్కాపురంలోనూ కొనసాగుతున్న తంతు

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

ప్రజలు, పార్టీ శ్రేణుల్లో నాయకుల పలుకుబడిని పలుచన చేయడం.. ఆపై ఏఇద్దరు నాయకులు సఖ్యతతో ముందుకు సాగకుండా విడదీయడం.. ఇదీ వైసీపీ అధిష్ఠానం తాజాగా ఆడుతున్న నాటకం. దీనికి సూత్రధారి, తెరవెనుక పాత్రధారి కూడా ఆపార్టీ అధినేత సీఎం జగన్ అంటే అతిశయోక్తి కాదు. ఉమ్మడి జిల్లా వైసీపీలో నెలకొన్న తాజా పరిణామాలు, అంతర్లీనంగా జరుగుతున్న వ్యవహారాలే అందుకు నిదర్శనం. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిలకు క్రమేపీ పార్టీ, పాలనా వ్యవహారాల్లో ప్రాధాన్యత తగ్గిస్తూ వచ్చిన సీఎం జగన్ తాజాగా వారిద్దరినీ విభజించి పాలించే సూత్రానికి శ్రీకారం పలికారు. కొన్ని నియోజకవర్గాలలో ఇటు సిటింగ్ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలకు చెక్‌పెట్టేవిధంగా చర్యలు చేపడుతూనే మరోవైపు వారిని సముదాయించే వ్యవహారాలను సాగిస్తున్నారు. అందుకు కందుకూరు, గిద్దలూరు, మార్కాపురం, అద్దంకి, దర్శి నియోజకవర్గాలలో చోటుచేసుకున్న పరిణామాలు నిదర్శనంగా చెప్పవచ్చు. ఈ నాటకాలను అర్థం చేసుకుంటున్న ఆపార్టీలోని సీనియర్ నేతలు ప్రతివ్యూహాలకు శ్రీకారం పలికారు. దీంతో ఈనెల 20వ తేదీ తర్వాత క్రమేపీ వైసీపీలో అనేక సరికొత్త పరిణామాలు చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది.

తెర పైకి చెవిరెడ్డిని తెచ్చి ఇంకో డ్రామా

ఇటీవల సరికొత్త డ్రామాకు వైసీపీ అధినేతలు శ్రీకారం పలికారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని బాలినేని వద్దకు పంపి తాను ఎంపీగా పోటీచేస్తాను సహకరించమని అడిగించారు. బాలినేని కోరుకున్నట్లు వైవీ కుటుంబసభ్యులకు టికెట్ ఇవ్వడం లేదని ఆ రూపంలో తెలియజేసే ప్రయత్నం చేశారు. వాస్తవానికి చెవిరెడ్డి అనారోగ్య కారణాలతో ఉన్నానని చంద్రగిరి అసెంబ్లీ టికెట్ తన కుమారుడికి ఇవ్వాలని పట్టుబట్టి జగన్ వద్ద సాధించుకున్నారు. ఇప్పుడేమో బాలినేని వద్దకొచ్చారు. బాలినేని కాదు పొమ్మన్నారు. ఆ నాటకం రక్తికట్టకపోవటంతో బాలినేనికి విజయసాయిరెడ్డికి తోడు సజ్జల రామకృష్ణారెడ్డి, సీఎంవో అధికారులు, ఇతర కొన్ని శాఖలకు చెందిన ఉన్నతాధికారుల ఫోన్లు చేయడం ప్రారంభించారు. మాగుంట విషయం మీకెందుకు? సీఎంకు ఏరకంగానైనా మీరే కావాలి అంటూ ఆయన్ను తమ వైపునకు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు.





రెండేళ్లుగా బాలినేనికి తగ్గిన ప్రాధాన్యం

వైసీపీ అధిష్ఠానం జిల్లాలో బాలినేని, మాగుంటల మధ్య సఖ్యతను దెబ్బతీసి చివరికి ఇద్దరికీ మొండి చేయి చూపించే దిశగా అడుగులు వేస్తోంది. మరీ అననుకూల పరిస్థితుల్లో బాలినేనిని దగ్గరకు చేర్చుకుని మాగుంటకు చెక్‌పెట్టేందుకు కూడా సిద్ధమవుతున్నట్లు తాజా పరిణామాలు తేటతెల్లం చేస్తున్నాయి. రెండేళ్ల నుంచి బాలినేనికి పార్టీ, పాలనా వ్యవహారాల్లో ప్రాధాన్యత తగ్గిస్తూ జగన్ అనేక చర్యలు తీసుకున్న విషయం విదితమే. తొలుత ఆయన సమీపబంధువు వ్యాపారానికి చెక్‌పెట్టారు. చివరికి మంత్రి పదవి నుంచి తప్పించడమేగాక పార్టీ పదవుల్లో నుంచి తప్పుకునేలా చేశారు. బాలినేని విజయవాడ వచ్చి మూడురోజులపాటు జగన్ ఇంటర్వ్యూ కోసం వేచి ఉండి వెనక్కు వెళ్లడం తెలిసిందే.

ఎన్నికైన కొద్దికాలానికే మాగుంటను దూరం పెట్టారు

మరోవైపు ఎంపీ మాగుంటను ఎన్నికైన కొద్దికాలం నుంచే జగన్ దూరం పెట్టారు. విధిలేని పరిస్థితుల్లో సింగరాయకొండ వద్ద ఉన్న ఆయన ఫ్యాక్టరీని చాలా కాలం మాగుంట మూసివేయడం కూడా జరిగింది. లిక్కర్ వ్యాపారంలో ఆయన కంపెనీ ఉత్పత్తులు రాష్ట్రంలో కనిపించలేదు. ఇవన్నీ అటుంచితే కేంద్రప్రభుత్వం నుంచి ఆయన ఒంగోలు లోక్‌సభ పరిధిలో ఏదైనా అభివృద్ధి పనులకు నిధులు తీసుకొస్తే రాష్ట్రప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారాన్ని ఇవ్వలేదు. వాటా నిధులు చెల్లించకుండా మోకాలడ్డారు. ఆయన సీఎంను కలిసింది కూడా చాలా తక్కువసార్లు. ఇక ప్రస్తుతం మాగుంటకు కొన్ని షరతులు పెట్టడం, ఆయన తిరస్కరించడం చివరికి అయన్ను తన గడప తొక్కనివ్వొద్దంటూ విజయసాయిరెడ్డికి సూచించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాలినేని, మాగుంటలు ఒకటిగా అధిష్ఠానానికి సంకేతమిచ్చారు. బాలినేని అయితే ఎంపీ అభ్యర్థిగా మాగుంట, అసెంబ్లీ అభ్యర్థిగా తాను ఉండాలని కోరుకుంటున్నామని అదే జరగబోతుందని ప్రకటించారు.

మాగుంటకు వేమిరెడ్డి ఫోన్‌లు

మాగుంట, ఆయన కుమారుడికి ఒంగోలు, నెల్లూరు రెండు పార్లమెంటు స్థానాల నుంచి పోటీచేసే అవకాశం ఇస్తామని టీడీపీ ప్రతిపాదన చేసినట్లు ప్రచారంలో ఉంది. ఈ విషయం జగన్ దృష్టిలోనూ ఉంది. అంతకుముందే జగన్ మాగుంటను పక్కనపెట్టారు. అలాంటిది రెండురోజుల నుంచి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాగుంటకు ఫోన్లుచేసి మీరు ప్రెస్‌మీట్ పెట్టాల్సిన పనిలేదు. డిపాజిట్ కట్టాల్సిన అవసరం లేదు. నేను జగన్‌తో మాట్లాడతానని ప్రతిపాదించడం విశేషం. ఇక వేమిరెడ్డి నెల్లూరు లోక్‌సభ వైసీపీ అభ్యర్థిగా పోటీచేయబోతున్న సమయంలో ఇంతకాలం పూర్తిగా జగన్ పక్కనపెట్టిన మాగుంటతో నేనున్నానురా అంటూ మాట్లాడటం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఒకేమాటగా కలిసి ఉన్న బాలినేని మాగుంటను విడదీసి చివరికి వారిని ఎటూ కాకుండా చేయడం లేదా బాలినేనిని వినియోగించుకుని మాగుంటకు చెక్‌పెట్టడమే లక్ష్యంగానే పనిచేస్తున్నట్లు రాజకీయ విశ్లేషకుల అంచనా. వచ్చే ఎన్నికల్లో తాను పోటీచేయబోనని ప్రకటించిన గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఎంపీ మాగుంటకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారు. నిజానికి గిద్దలూరు నియోజకవర్గంలో రాంబాబుకు వ్యతిరేకంగా పనిచేసిన రెడ్డి సామాజికవర్గం నాయకుల్లో ఎక్కువ మంది బాలినేని అనుచరులు. ఆయన బాలినేనిని ఒక్కమాట కూడా అనకుండా మాగుంటపై విరుచుకుపడటం అధిష్ఠానం కుట్రలో భాగమన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల రాంబాబును పిలిపించుకుని జగన్ మాట్లాడటం ఆ తర్వాత ఆయన నియోజకవర్గంలో పర్యటనలు ప్రారంభించటం గమనార్హం.

కందుకూరు విషయంలోనూ అంతే

కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డికి కూడా సీఎం షరతులు విధించారు. ఆయన కూడా కుదరదన్నారు. దీంతో బొట్ల రామారావు అనే బీసీ నాయకుడిని పిలిపించుకుని.. వెళ్లి కందుకూరులో పనిచేయాలని జగన్ ప్రోత్సహించి పంపారు. అదేరోజు రాత్రి రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నెల్లూరులో మహీధర్‌రెడ్డితో భేటీ అయ్యారు. మరుదినమే మహీధర్‌రెడ్డికి కూడా తెలియకుండా ఐప్యాక్ ప్రతినిధులు మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఆయన్ను మాట్లాడమన్నారు. తన గౌరవం తగ్గకుండా మహీధర్‌రెడ్డి మాట్లాడినప్పటికీ బీసీ అభ్యర్థిని రంగంలోకి దించే వ్యవహారాన్ని జగన్ మానుగుంటని దారిలోకి తెచ్చుకునేందుకేనని, అందుకే వేమిరెడ్డిని రంగంలోకి దింపారని భావిస్తున్నారు.

మార్కాపురం, కనిగిరిల్లో..

మార్కాపురం నియోజకవర్గంలోనూ ఇటు ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి, అటు మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డిలను ఒకేరోజు సీఎంవోకు పిలిపించారు. జంకెను మధ్యలోనే వెనక్కు పంపించి నాగార్జునరెడ్డితోనే సీఎం మాట్లాడారు. అక్కడ అభ్యర్థి ఎంపికలో ఊహాగానాలు మారిపోయాయి. కనిగిరిలో ఎమ్మెల్యే బుర్రాకే టికెట్ అని సంకేతం ఇచ్చినప్పటికీ ఆయనను వ్యతిరేకించే రెడ్డి సామాజికవర్గం నాయకులను కట్టడిచేయకపోవటం అనుమానాలకు తావిస్తోంది. ఇదే తరహాలో అద్దంకి, పర్చూరుతో పాటు మరికొన్ని నియోజకవర్గాలలో సాగుతున్న వ్యవహారాలను పరిశీలిస్తే వైసీపీలో రానున్నరోజుల్లో అనేక సరికొత్త పరిణామాలు చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది.



ఒంగోలు ఎన్టీఆర్ భవన్‌లో ప్రజావ్యతిరేక జీవో ప్రతులను దహనం చేస్తున్న జనార్దన్, నేతలు

నిరసన మంటలు

భోగి కార్యక్రమంలో ప్రజావ్యతిరేక జీవోల ప్రతులను దహనం చేసిన టీడీపీ నేతలు

ఎస్మా ఉత్తర్వులను తగులబెట్టిన అంగన్‌వాడీలు

అదేబాటలో ఉపాధ్యాయులు

ఒంగోలు, జనవరి 14 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ వేళ కూడా ప్రభుత్వ తీరుపై నిరసనలు వెల్లువెత్తాయి. వివిధ రంగాల వారు ఆయా వర్గాల ప్రజలకు ఇబ్బందికలిగించేలా ప్రభుత్వం ఇచ్చిన జీవోల ప్రతులను భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల భూములపై తెచ్చిన జీవోలతోపాటు రహస్యంగా ఇచ్చిన అనేక ప్రజా వ్యతిరేక ఉత్తర్వులను భోగిమంటల్లో వేసి నిరసనలు తెలపాలని టీడీపీ రాష్ట్రవ్యాప్తంగా 'పల్లె పిలుస్తుందిరా... కదిలిరా.. టీడీపీ భోగి సంకల్పం' పేరుతో పిలుపునివ్వగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆపార్టీ శ్రేణులు కార్యక్రమం నిర్వహించాయి. 'సైకో పోవాలి..సైకిల్ రావాలి'.. 'కీడు తొలగాలి.. ఏపీ వెలగాలి' అని నినదిస్తూ పెద్దఎత్తున ఆదివారం ఉదయం భోగి మంటల్లో ఆయా జీవోల ప్రతులను దహనం చేశారు. ఒంగోలులోని పార్టీ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నేతృత్వంలో కార్యక్రమం జరిగింది. సంతనూతలపాడులో మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, కనిగిరిలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, గిద్దలూరులో మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి స్థానిక టీడీపీ శ్రేణులతో కలిసి నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. పలు ఇతరచోట్ల అక్కడి టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో నిరసనలు జరిగాయి. కాగా సమస్యల పరిష్కారం కోరుతూ 34 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు ప్రభుత్వం ఇచ్చిన ఎస్మా ప్రతులను ఆదివారం ఉదయం భోగి మంటల్లో వేసి తగులబెట్టారు. ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు పెట్టినా సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ఇదిలా ఉండగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం దశలవారీ ఆందోళనలు నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు ఆదివారం భోగి సందర్భంగా టీచర్లకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం ఇచ్చిన జీవోల ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు.



యూటీఎఫ్ ఆధ్వర్యంలో...



ఎస్మా కాపీలను కాలుస్తున్న అంగన్‌వాడీలు, ప్రజా సంఘాల నేతలు




సంక్రాంతి శుభాకాంక్షలు
ప్రజా పరిచయ వేదిక
నిండైన ఆశీస్సుల వేడుక
దగ్గుమళ్ళ ఆత్మీయ కలయిక...
బాపట్లలో ప్రజా పరిచయ వేడుక...
ఇది ప్రజల ఆశీర్వాద కానుక...
ప్రజా సేవకు కావాలి ఇది వేదిక
తెలుగుదేశంపార్టీ అధినేత శ్రీ చంద్రబాబు నాయుడు గారి ప్రోత్సాహంతో బాపట్ల పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశం రావాలన్నా ఆకాంక్షతో ఏర్పాటు చేసిన ప్రజా పరిచయ వేదికకు భారీ ఎత్తున విచ్చేసిన అభిమాన జనానికి, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాము.
భవిష్యత్తులో ఇదే విధమైన మీ సంపూర్ణ సహకారం కోరుతూ...
తెలుగుదేశం పార్టీ
మీ..
దగ్గుమళ్ళ ప్రసాదరావు
IRS (చిన్నబుజ్జి)
బాపట్ల పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ నాయకులు


భోగిమంటకు నమస్కరిస్తున్న శిద్దా రాఘవరావు కుటుంబసభ్యులు


లాయర్‌పేట సాయిబాబా మందిరం దగ్గర భోగి వేడుకలు


విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో సంక్రాంతి పిండివంటల ప్రదర్శన

ఆనందోత్సాహాలతో భోగి సంబరాలు

తెల్లవారుజామునే భోగిమంటలు వేసిన ప్రజలు

ఒంగోలు(కల్చరల్), జనవరి 14: ఒంగోలు నగరంలో భోగి పండుగ సంబరాలు ఆదివారం అంబరాన్నంటాయి. తెల్లవారుజామునుంచే ప్రజలు తమ ఇళ్లముందు భోగిమంట వేశారు. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా కేరింతలు కొడుతూ ఆ భోగిమంట దగ్గర చలికాచుకున్నారు. ఇక అనేక సంస్థల ఆధ్వర్యంలో నగరంలో భోగి, సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు నివాసం వద్ద భోగి వేడుకలు జరిగాయి. శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతులు, టీటీడీ పాలకమండలి సభ్యులు శిద్దా సుధీర్‌కుమార్, శృతి దంపతులు సంప్రదాయబద్ధంగా అగ్నిదేవునికి, సూర్యభగవానునికి నమస్కరించి భోగిమంటలను వెలిగించారు. అనంతరం గంగిరెద్దుల వారిని శాలువతో సత్కరించారు.


కమ్మపాలెంలో భోగిమంట వేస్తున్న స్థానికులు

స్థానిక లాయర్‌పేట సాయిబాబా మందిరం దగ్గర లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భోగి, సంక్రాంతి సంబరాలలో వైసీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి హాజరై భోగిమంటలను వెలిగించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. జేసీఐ క్లబ్ వేసిన రంగోలి, బొమ్మల కొలువు, గంగిరెద్దులు, డప్పుల ప్రదర్శన ప్రజలను మంత్రముగ్ధులను చేశాయి. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెన్నపూస శ్రీరాములురెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రకాష్‌బాబు, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, డీవీ.రాఘవ, పువ్వాడ రాజేష్, సోమినేని సురేష్, మంగళగిరి నరసింహారావు, కూరపాటి రమేష్, నోబుల్ చరియన్, జలదంకి సురేష్ పాల్గొన్నారు.

100రకాల సంప్రదాయ వంటల ప్రదర్శన

ఒంగోలు(కలెక్టరేట్): ఆంధ్రప్రదేశ్ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శ్రీ చైతన్య కాలేజీ ఆవరణలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలుగు సంప్రదాయ వంద రకాల రుచుల కార్యక్రమాన్ని జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్ ఏర్పాటు చేయగా ముఖ్యఅతిథులుగా సామాజికవేత్త మండవ మురళీకృష్ణ, వెంకట రమణహాస్పటల్ డాక్టర్ చంద్రశేఖర్ హాజరై ఆహారపదార్థాల రుచులను చూశారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ పిండి వంటల ద్వారా ఆరోగ్యానికి మంచిదని ఆరిసెలు, పాల బూరెలు, సజ్జబూరెలు, శనగ ముద్దలు, వేరుశనగ ముద్దలు, జాంగ్రి, జిలేబి తదితర రకాల వంటలకాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కరుణాకర్, డివిజన్ అధ్యక్షుడు శ్రీకృష్ణ, ప్రధాన కార్యదర్శి సూర్యప్రకాష్, శ్రీనివాస్, లోకేష్, రాము, అశోక్‌రాజు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరులో..

టంగుటూరు: సంతోషాల వెలుగును తెస్తూ చెడు అనే చీకటిని తొలగించి నిండైన ఉత్సాహంతో సంక్రాంతి లక్ష్మికి ఇచ్చే హారతే ఈభోగి మంట అని టీడీపీ నాయకుడు బెల్లం జయంత్‌బాబు చెప్పారు. ఈఏడాది కూడా టంగుటూరులో సంక్రాంతి సంబరాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం తెల్లవారుజామున జయంత్‌బాబు, టీడీపీ నేత కామని విజయకుమార్ భోగి మంటలు వేసి ప్రారంభించారు. గ్రామస్థులంతా ఎప్పటిలాగే ఐక్యంగా సంక్రాంతి సంబరాలను జరుపుకుంటున్నారు. ఈవేడుకలను మసీదు సెంటర్ వేదికగా కొనసాగిస్తున్నారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కామని విజయకుమార్, కామని నాగశ్రీను, బెజవాడ వెంకటేశ్వర్లు, చదలవాడ చంద్రశేఖర్ పాల్గొన్నారు.


టంగుటూరులో జరిగిన వేడుకల్లో పాల్గొన్న టీడీపీ నేతలు జయంత్‌బాబు, కామని విజయకుమార్

మద్దిపూడి మండలంలో..

మద్దిపూడి: మండలంలోని అన్ని గ్రామాల్లో భోగిపండుగ సంబరాలు అంబరాన్నంటాయి. గుండ్లసముద్రంలో స్పేస్‌విజన్ సంస్థ అధినేత తూమాటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన రాష్ట్రస్థాయి ఎడ్లబల ప్రదర్శన నిర్వహించనున్నారు. సోమవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మద్దిపూడిలో నాలుగు తరాలకు చెందిన తల్లీకూతుళ్లు ఒకచోట కనిపించడం ఆకట్టుకుంది.

ఘనంగా అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణ

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 14: ఒంగోలు నగరం గుంటూరురోడ్డులో ఏర్పాటు చేసిన విప్లవ వీరుడు, స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణ ఆదివారం ఘనంగా జరిగింది. క్షత్రియ సంఘం ప్రతినిధి రాము ఆధ్వర్యంలో టీటీడీ సభ్యుడు శిద్దా సుధీర్‌కుమార్, వైసీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం విగ్రహావిష్కరణ చేశారు. కార్యక్రమంలో 50వ డివిజన్ కార్పొరేటర్ అంబటి ప్రసాదరావు, రావూరి బుజ్జి, కాకర్లపూడి నరసింహారాజు, జంపని కృష్ణంరాజు, వాసు, సీహెచ్.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


విగ్రహావిష్కరణ చేసిన శిద్దా సుధీర్, ప్రణీత్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీ బాపట్ల పార్లమెంట్ కోఆర్డినేటర్‌గా శ్రీపతి

ఒంగోలు(క్రైం), జనవరి14: కాంగ్రెస్ పార్టీ బాపట్ల పార్లమెంట్ కో ఆర్డినేటర్‌గా శ్రీపతి ప్రకాష్‌ను నియమిస్తూ ఆ పార్టీ అఖిలభారత కార్యదర్శి వేణుగోపాల్ ఆదివారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రకాష్‌ను నాయకులు జేడీ.శీలం, కొప్పల రాజు, కనుమూరి బాపిరాజు, మస్తాన్‌వలి తదితరలు శాలువాలతో సత్కరించారు.

రేపు సేవాస్తంభ్ సమావేశం

ఒంగోలు(కల్చరల్), జనవరి 14: సేవాస్తంభ్ ఆధ్వర్యంలో మొదటి సమావేశం ఈనెల 16న ఒంగోలు అంబేద్కర్‌భవన్‌లో జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.మధుసూదనరావు, నరసింహారావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. సభ్యులు పాల్గొనాలని వారు కోరారు.

నేడు పోలీసు స్పందన రద్దు : ఎస్పీ

ఒంగోలు(క్రైం), జనవరి14: సోమవారం సంక్రాంతి పండుగ సందర్భంగా సెలవు కావడంతో పోలీసు స్పందనను రద్దు చేస్తున్నట్లు ఎస్పీ మలికగర్గ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని ఆమె కోరారు.

రైలు కింద పడి వృద్ధుడు ఆత్మహత్య

ఒంగోలు(క్రైం), జనవరి14: రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం ఒంగోలు రైల్వే పోలీస్‌స్టేషన్ వద్ద జరిగింది. సుమారు 65 ఏళ్ళ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తెలుపురంగు లుంగీ, తెలుపు రంగు చొక్కా ధరించాడు. రైల్వేపోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండ్లకమ్మ ప్రాజెక్టు అభివృద్ధికి కృషి : మంత్రి మేరుగ

మద్దిపాడు, జనవరి 14: గుండ్లకమ్మ ప్రాజెక్టును అన్నివిధాలుగా అభివృద్ధి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని సాంఘిక సంక్షేమ శాఖమంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. ఆదివారం గుండ్లకమ్మ ప్రాజెక్టును ఆయన సందర్శించి అధికారులతో దానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీఎం జగన్మోహన్‌రెడ్డి దృష్టికి ప్రాజెక్టు సమస్యను తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. ప్రాజెక్టుకు కొత్త గేట్లు నిర్మాణంతోపాటు పరిసర ప్రాంతాలు సుందరంగా తీర్చి దిద్దుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అరుణ, వైపీపీ మండల కన్వీనర్ మండవ అప్పారావు, ఎంపీటీసీ కోటిరెడ్డి, మల్లవరం సర్పంచ్ నారా సుబ్బారెడ్డి, రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీ ప్రభాకర్ తదితరులు పాలొన్నారు.

గుంటూరు	:సరస్వతిథియేటర్	బాపట్ల	:విజయకృష్ణ
గుంటూరు	:హరిహరమహల్	పిడుగురాళ్ళ	:జయలక్ష్మీ
గుంటూరు	:నాజ్‌అప్సరథియేటర్	సత్తెనపల్లి	:ఈశ్వరసాయి
గుంటూరు	:వి.ప్లాటినో	మాచర్ల	:వెంకటేశ్వర
గుంటూరు	:ది సినిమాస్	వినుకొండ	:సురేష్‌మహల్
గుంటూరు	:జెఎల్ఇసినిమాస్	అద్దంకి	:VNS
తెనాలి	:మినిసంగమేశ్వర	టంగుటూరు	:వెంకటేశ్వర
తెనాలి	:పెమ్మసానిథియేటర్	చీమకుర్తి	:కె3కెస్క్రీన్స్
ఒంగోలు	:గోరంట్లసినిమాస్		
ఒంగోలు	:రవిప్రియమహల్		
చీరాల	:సురేష్‌మహల్		
నరసరావుపేట	:లక్ష్మీనరిసింహ		
చిలకలూరిపేట	:విజయభాస్కర్		
మంగళగిరి	:అన్నపూర్ణ		
రేపల్లె	:రాజ్యలక్ష్మీ		
పొన్నూరు	:శ్రీలక్ష్మీ		



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం : టీడీపీ


కరపత్రాన్ని అందజేస్తున్న జయంత్‌బాబు

మద్దిపాడు, జనవరి 14 టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణంతోపాటు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఫ్రీగా చంద్రబాబు అందిస్తారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం మద్దిపాడులో జరిగిన బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్తు లో ప్రతిఒక్కరి ఆర్థిక పరిస్థితి మెరుగుపడే విధంగా చంద్రబాబునాయుడు కృషి చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో కడియాల రఘుబాబు, పాటిబండ్ల అజయ్, దేవబత్తిన ప్రసాద్, మండవ గోపీనాథ్, రావి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

20న నవోదయ ప్రవేశపరీక్ష

- 18 కేంద్రాల ఏర్పాటు

ఒంగోలు(విద్య), జనవరి 14 : ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈనెల 20న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతుందన్నారు. విద్యార్థులు ఉదయం పది గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. పరీక్షకు మొత్తం 3921 మంది విద్యార్థులు హాజరవుతుండగా వారికి అందుబాటులో ఉండే విధంగా 18 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒంగోలులో 4, అద్దంకిలో 2, మార్టూరులో 2, చీమకుర్తిలో 2, టంగుటూరులో 3, కందుకూరు, వలేటివారిపాలెం, సింగరాయకొండ, పర్చూరు, చీరాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు హాల్ టిక్కెట్లతో హాజరుకావాలని కోరారు.

ఘనంగా భోగి వేడుకలు

సంతనూతలపాడు, జనవరి 14: మండలంలో ఆయా గ్రామాల్లో ప్రజలు ఆది వారం భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. సంతనూతలపాడులోని కరణంగారిబజారులో బ్రాహ్మణసేవాసమితి ఆధ్వర్యంలో భోగిమంటలు వేశారు. మందిరం బజారులో పలువురు యువకులు వేకువజాము నుంచే భోగి మంటలు వేస్తూ సందడి చేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవాసమితి మండల అధ్యక్షులు చివుకుల సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.





















కబడ్డీ పోటీల్లో విజేతలకు బహుమతి అందజేస్తున్న బీఎన్ విజయ్‌కుమార్

చీమకుర్తిలో కబడ్డీ, ముగ్గుల పోటీలు

● రూ.లక్ష బహుమతి అందజేసిన బీఎన్

చీమకుర్తి, జనవరి 14: చంద్రన్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా చీమకుర్తిలో ఆదివారం నిర్వహించిన మహిళల కబడ్డీ ,ముగ్గులపోటీలకు విశేష స్పందన లభించింది. పట్టణంలోని ఎంఎస్‌ఆర్ అపార్ట్‌మెంట్స్ ప్రాంగణంలో నిర్వహించిన ఈ పోటీలను నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ముగ్గులు, కబడ్డీ పోటీల్లో మహిళలు పాల్గొని తమ ప్రతిభను చాటారు. కాగా ముగ్గులపోటీల్లో ప్రథమస్థానం సాధించిన చీమకుర్తికి చెందిన కె.విజయలక్ష్మికి రూ.లక్ష బహుమతిని బీఎన్ అందజేశారు. ద్వితీయ బహుమతి చీమకుర్తికి చెందిన సుజాతకు రూ.50వేలు, తృతీయబహుమతి ఎస్‌ఎన్‌పాడుకు చెందిన రూ.సుబ్బలక్ష్మికి రూ.25వేలను ప్రదానం చేశారు. ఇక కబడ్డీ పోటీల్లో ప్రథమ బహుమతి వైజాగ్‌టీం, ద్వితీయ బహుమతి ప్రకాశం, తృతీయ బహుమతిని ఇంకొల్లు టీంలు సాధించాయి. కార్యక్రమంలో నాయకులు ఆరికట్ల సుమతి, మన్నం ప్రసాద్, గొల్లపూడి సుబ్బారావు, యడ్లపల్లి రామబ్రహ్మం, మన్నం నాగరాజు, ఉన్నం సుబ్బారావు, కట్రగడ్డ రమణయ్య, పూనాటి వెంకట్రావు, అవనిగడ్డ శేషారావు, గొట్టిపాటి రాఘవరావు, మద్దినేని హరిబాబు, రావిపాటి రాంబాబు పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో భోగి వేడుకలు

ఒంగోలు (కార్పొరేషన్), జనవరి 13 : ఒంగోలులోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో భోగి సంబరాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్, నాగసత్యలత దంపతులు హాజరయ్యారు. వేడుకలలో భాగంగా రాష్ట్రానికి పట్టిన పీడ పోవాలని, జగన్ విడుదల చేసిన జీవో ప్రతులు, జగన్ ఫొటోలను భోగి మంటల్లో వేసి సైకోపోవాలి, సైకిల్ రావాలి అంటూ నినాదాలుచేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: భోగి పండుగను పురస్కరించుకుని సీఎం జగన్ తెచ్చిన జీవోల ప్రతులను రాష్ట్రంలో రాక్షస పాలన అంతమవ్వాలంటూ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం సంతనూతలపాడులో భోగిమంటలో వేసి దహనం చేశారు. మరో రెండు నెలల్లో పేద, మధ్యతరగతి ప్రజలు కోరుకునే చంద్రబాబు ముఖ్యమంత్రి పీఠం ఎక్కుతారని, జనరంజక పాలన అందిస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సెక్రటరీ అడకాస్వాములు, మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నాయకులు సాధినేని శ్రీరామ్మూర్తి, ఎం.శ్రీనివాసరావు, మాధవిలత, బి.శంకర్, ఆర్.సురేష్, ఎస్.సుబ్బారావు, భాస్కరరావు, అంకారావు, జనార్దన్, సుబ్బయ్య, మక్బూల్, సుబ్బయ్య, నాయబ్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

సింగరాయకొండ, జనవరి 14 : జాతీయ రహదారి దాటుతుండగా ప్రమాదవశాత్తు కారు ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన స్థానిక జాతీయ రహదారిపై శానంపూడిరోడ్డు సమీపంలో ఆదివారం రాత్రి సుమారు 1.45 గంటల సమయంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నెల్లూరు భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన సాదు శ్రీనివాసులు(45) మండలంలోని ఊళ్లపాలెంలో ద్వితీయ వివాహం చేసుకుని అక్కడే నివాసం ఉంటున్నారు. కూలి పనుల నిమిత్తం తిరుపతిలో బేల్దారి పనులు చేస్తున్నారు. తిరుమల నుంచి ఊళ్లపాలెం బయల్దేరి ఆదివారం అర్ధరాత్రి ట్రావెల్ బస్సులో జాతీయ రహదారిపై శానంపూడి రోడ్డు దగ్గర దిగాడు. అనంతరం రోడ్డు దాటుతుండగా ఒంగోలు నుంచి చెన్నై వెళ్తున్న కారు ఢీకొట్టడంతో సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. వెంటనే సమాచారం అందుకున్న ఎస్సై టి. శ్రీరామ్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. శవపరీక్ష నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాల ఆధారంగా కారును, నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శ్రీరామ్

‘బాబు’తోనే రాష్ట్రానికి భవిష్యత్తు

● అధికారంలోకి రాగానే సమస్యలకు శాశ్వత పరిష్కారం

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల

ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 13: రాష్ట్రానికి మంచిరోజులు రావాలన్నా, అన్ని వర్గాల భవష్యత్ బాగుపడాలంటే చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని పీఏజీ కన్వెన్షన్ హాలులో సాఫ్ట్‌వేర్, డాక్టర్స్ న్యాయవాదులు, వివిధ ప్రభుత్వ ఉద్యోగులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం మరో 20 ఏళ్ళు వెనక్కిపోయిందన్నారు. కనీస రాజధాని లేని రాష్ట్రంగా మిగిలిపోవడం దారుణమని విమర్శించారు. ఒంగోలులో భూకబ్జాలు, దోపిడీలు పెరిగిపోయాయని ఆరోపించారు. ఇంత వరకు నగరంలో జరిగిన అభివృద్ధిపై వైసీపీ పాలకులు నోరు విప్పలేని పరిస్థితి ఉందన్నారు. రాష్ట్రానికి త్వరలోనే మంచి రోజులు రాబోతున్నాయని, అన్ని వర్గాల ప్రజలు తెలుగుదేశం పార్టీ పాలన కోరుకుంటున్నారని పేర్కొన్నారు. తాను ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టగా, ఒకటి, రెండు పనులు పది శాతం మిగిలిపోయాయని, కనీసం వాటిని కూడా పూర్తి చేయలేని వైసీపీ పాలకులకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. తాను మరలా గెలిస్తే తప్పకుండా నగరంలో తాగునీటి, డ్రైనేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తానని తెలిపారు. అలాగే కొత్తపట్నం వెళ్ళే మార్గంలో బ్రిడ్జిని పూర్తి చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. అంతేగాకుండా వైసీపీ పాలనలో జరిగిన భూ కబ్జాలు, దోపిడీలు అన్నీ బయటకు తీస్తామని, బాధితులకు అండగా ఉండి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోనే ఒంగోలును అభివృద్ధిలో ప్రథమ స్థానంలో ఉంచుతానని దామచర్ల వెల్లడించారు. సమావేశంలో ప్రొఫెషనల్స్ రాష్ట్ర అధ్యక్షురాలు పొడపాటి తేజస్విని, ఐటీ ప్రొఫెషనల్ శరత్‌చంద్ర, డాక్టర్ రాము, అడ్వకేట్ మౌనిక, ఐటీ ప్రొఫెషనల్ సభ్యులు కొల్లూరి చంద్ర, కృష్ణ, సుధీర్, శ్వేత, మౌనిక, సునీల్ కుమార్, దామచర్ల కుమార్తెలు తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.



పీఏజీ కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో దామచర్లకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సాఫ్ట్‌వేర్‌లు, డాక్టర్‌లు

నేడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో ఆత్మీయ సమావేశం

● పొన్నలూరులో భారీ కార్యక్రమం

పొన్నలూరు (కొండపి), జనవరి 14 : సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణాలన్నీ పల్లెల్లోకి వచ్చాయి. గ్రామాల నుంచి ఇతర రాష్ట్రాలకు, పట్టణాలకు వెళ్లి ఉద్యోగాలు చేసుకుంటున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సంక్రాంతికి సొంత గ్రామాలకు చేరుకున్నారు. ఈనేపథ్యంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులందరూ ఒక వేదికపైకి వచ్చి రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, జనసేన రాష్ట్ర అధినేత పవన్‌కల్యాణ్‌ల ఆవశ్యకత, అధికారంలోకి రావాల్సిన అవసరం, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు, సాఫ్ట్‌వేర్ ప్రగతి తదితర విషయాలను తెలియజేసే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దాదాపు 1000 మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో పొన్నలూరులో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు భారీ సమావేశం ఏర్పాటుచేశారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు వాట్సాప్ గ్రూపుల ద్వారా హైదరాబాద్, బెంగళూరు, పూణే, చెన్నై, ముంబయి, నోయిడా విశాఖతోపాటు, ఇతర ప్రాంతాల్లోని యువ ఉద్యోగులు కూడా కార్యక్రమానికి హాజరయ్యేలా యువకులు కార్యాచరణ రూపొందించుకున్నారు. సభా ప్రాంగణం, వాహనాల పార్కింగ్ స్థలం చదును చేశారు. కార్యక్రమంలో అతిథిగా రాష్ట్ర ఐటీ ప్రొఫెనషల్స్ వింగ్ అధ్యక్షురాలు పొడపాటి తేజశ్విని, ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య పాల్గొంటారని పార్టీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు తెలిపారు.



జీవో ప్రతులను తగులబెడుతున్న అంగన్‌వాడీలు

భోగి మంటల్లో జీవోలు, నోటీసులు

● కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

నిరవధిక నిరాహార దీక్షలు

● పండుగ రోజూ ఆందోళన

ఒంగోలు నగరం, జనవరి 14: రాష్ట్రవ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు జరుగుతుంటే అంగన్‌వాడీలు మాత్రమే రోడ్డు మీదే ఆందోళన కొనసాగిస్తున్నారు. తమ డిమాండ్ల సాధన కోసం గత 34 రోజులుగా సమ్మె బాట పట్టిన అంగన్‌వాడీల ఆందోళన అణిచివేయాలని ప్రభుత్వం ప్రయోగించిన ఎస్మా జీవోల ప్రతులను, వెంటనే విధుల్లో చేరాలంటూ అధికారులు ఇచ్చిన సంజాయిషీ నోటీసులను ఆదివారం వేకువజామున స్థానిక కలెక్టరేట్ వద్ద వేసిన భోగిమంటల్లో తగులబెట్టారు. జగనన్న మొండి వైఖరిని భోగిమంటల్లో తగులపెడుతున్నామని అంగన్‌వాడీలు విమర్శించారు. కాగా కలెక్టరేట్ వద్ద జరుగుతున్న 24 గంటల నిరవధిక నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 9వ రోజుకుచేరాయి. ఈ దీక్షలనుఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయ్యపరెడ్డి ప్రారంభించారు. సీఐటీయూ నాయకులు కాలం సుబ్బారావు, జీవీ.కొండారెడ్డి, కేవీపీఎస్ నాయకులు రాఘవులు మద్దతు తెలిపారు. అంగన్‌వాడీలపై అక్రమంగా ప్రయోగించిన ఎస్మాను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, టి.మహేష్, అన్నపూర్ణ, సుబ్బమ్మ, ప్రశాంతి, హేమిమా, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి : అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు గంటెనపల్లి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా అంగన్‌వాడీలు ఎస్మా జీవోలను భోగి మంటల్లో వేసి కాల్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ నాయకుడు కేజీ మస్తాన్, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు ఆదిలక్ష్మీ, పున్నమ్మ, రంగమ్మ పాల్గొన్నారు.

టంగుటూరులో..

టంగుటూరు: అంగన్‌వాడీల సమ్మెను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాము, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వీ మోజెస్ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమ్మె 34వ రోజైన ఆదివారం కూడా కొనసాగింది. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వేదికగా కొనసాగుతున్న నిరసన సందర్భంగా ఎస్మా చట్టం ప్రతులను భోగీ మంటలో తగులబెట్టారు. రాము, వీ మోజెస్, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు బీ శేషమ్మ, క్రాంతి, జీ సుభాషిణి, ప్రసన్న, శ్రీదేవి, లక్ష్మీ, ఆశాబీ పాల్గొన్నారు.

భూయాజమాన్య హక్కుల చట్టాన్ని రద్దు చేయాలి

కొండపి, జనవరి 14 : రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన భూయాజమాన్య హక్కుల చట్టాన్ని వెంటనే విరమించుకోవాలని సీపీఐ రాష్ట్ర నాయకురాలు రావులపల్లి లక్ష్మి డిమాండ్ చేశారు. భోగి పండుగ సందర్భంగా మండలంలోని నేతివారిపాలెంలో ఆమె మహిళా రైతులతో కలిసి ఆదివారం తెల్లవారు జామున భోగిమంటల్లో ఆ జీవో ప్రతులను వేసి తగులబెట్టారు.

సింగరాయకొండ : ప్రజల ఆస్తులను దొడ్డిదారిన కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే భూహక్కుల యాజమాన్య చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని జిల్లా ఏపీ రైతుసంఘం ప్రధాన కార్యదర్శి కె. వీరారెడ్డి డిమాండ్ చేశారు. కలికివాయి గ్రామంలో ఆదివారం భోగిమంటలలో భూయాజమాన్య హక్కుల ప్రతులను రైతులతో కలిసి తగలబెట్టి నిరసన తెలిపారు.



కొండపిలో జీవో ప్రతులను తగులబెడుతున్న సీపీఐ నాయకురాలు, మహిళా రైతులు

వైభవంగా గోదాదేవి, రంగనాథుల కల్యాణం

ఒంగోలు(కల్చరల్), జనవరి 14: ధనుర్మాసం ముగింపు సందర్భంగా ఆదివారం ఒంగోలు నగరంలోని పలు దేవాలయాల్లో గోదాదేవి, రంగనాథస్వామి వార్ల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. స్థానిక కొణిజేడు బస్టాండు శ్రీప్రసన్న ఆంజనేయస్వామి దేవస్థానంలో ఏర్పాటుచేసిన కల్యాణోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. నిర్వాహకులు ఈదుపల్లి దశరథరామారావు, రేణుకాదేవిల ఏర్పాట్లు పర్యవేక్షించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. స్థానిక సంతపేట సాయిబాబా మందిరంలో సైతం స్వామివార్ల కల్యాణం జరిగింది. కమిటీ నిర్వాహకులు అళహరి చెంచలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఇక గడియారం వారి వీధిలోని శ్రీఅనంత కోదండరామస్వామి దేవస్థానం, దక్షిణం బజార్ రామాలయం, గాంధీరోడ్డు గీతామందిరం తదితర దేవస్థానాలలో సైతం గోదాదేవి, రంగనాథుల కల్యాణోత్సవాలు వైభవంగా జరిగాయి.



ఒంగోలులో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పాతసింగరాయకొండలో..

సింగరాయకొండ: దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధి గాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆదివారం భోగి సందర్భంగా ఆలయంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్ వరాహ లక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్లు రాజ్యలక్ష్మి, గోదాదేవిలను యోగానంద లక్ష్మీనరసింహస్వామి, స్వయంభు ఆంజనేయుడిని పూలతో అలంకరించారు. తదనంతరం స్వాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ పామర్తి మాధవరావు, ఈవో పి. కృష్ణవేణి, ప్రధాన అర్చకుడు ఉదయగిరి వెంకట శేషాలక్ష్మీనరసింహాచార్యులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో..

చీమకురి : ధనుర్మాస పూజల్లో భాగంగా చీమకుర్తిలోని వాసవీ కల్యాణమండపంలో గోదాదేవి కల్యాణమహోత్సవం అత్యంత వైభవంగా ఆదివారం జరిగింది. టీటీడీ అర్చకులు పరాంకుశం సాయి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి కుంభజడల మన్మథరావు

సామాజిక సాధికారతకు పరితపించిన మహనీయుడు అంబేడ్కర్

● హైకోర్టు న్యాయమూర్తి మన్మథరావు

● కనుమళ్లలో కాంస్య విగ్రహావిష్కరణ

సింగరాయకొండ, జనవరి 14 : ప్రజల సామాజిక, ఆర్థిక సాధికారత కోసం జీవితాంతం పరితపించిన మహనీయుడు రాజ్యాంగశిల్పి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని హైకోర్టు న్యాయమూర్తి కుంభజడల మన్మథరావు కొనియాడారు. మండలంలోని కనుమళ్ల గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం రాత్రి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మన్మథరావు మాట్లాడుతూ యువతను మద్యం, మాదక ద్రవ్యాలు పట్టిపీడిస్తున్న జాబితాలో తాజాగా మొబైల్ మత్తు కూడా చేరిందన్నారు. తొలుత స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి కనుమళ్ల అంబేడ్కర్ విగ్రహం వరకూ యువత బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డీటీవో మన్నం సుగణమ్మ, ఆంధ్రయూనివర్సిటీ ప్రొఫెసర్లు డాక్టర్ పీడీ సత్యపాల్, కనుకుర్తి వెంకట్రావు, గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ సి. ప్రజ్ఞ, న్యాయవాది సన్నెబోయిన శ్రీనివాసులు, అంబటి కొండలరావు పాల్గొన్నారు.






పొదిలిలో భోగిమంటలు వేస్తున్న ఓ కుటుంబం, త్రిపురాంతకంలో గోదాదేవి రంగనాయకుల గ్రామోత్సవం

కొమరోలులో గ్రామోత్సవం, మార్కాపురంలో గోదాదేవి కల్యాణంలో భక్తులు

ఉత్సాహంగా భోగి మంటలు

- వేకువనే భోగి మంటలతో స్వాగతం
- పలు ఆలయాల్లో గోదాదేవి కల్యాణం
- పలు ఆలయాల్లో భక్తుల పూజలు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 14: భోగి పర్వదినాన్ని మార్కాపురంలో ఆదివారం సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భోగిమంటల్లో పాత వస్తువులను దహనం చేశారు. మనసులో ఈర్ష, అసూయ, ద్వేషాలను కూడా వదిలివేయాలని కోరుతూ మహిళలు వివిధ వీధుల్లో భోగి మంటలు వేశారు. ఇళ్ల ముందు ముగ్గులు తీర్చిదిద్దారు.

కొమరోలు : మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని తొలిరోజు భోగి పండుగను ఆదివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక శ్రీ భూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో సంక్రాంతి సందర్భంగా గోదాదేవి, శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని దంపతులతో పూజారి వెంకటేష్ నిర్వహించారు. కల్యాణమహోత్సవ కార్యక్రమాలను భక్తులు పెద్దసంఖ్యలో తిలకించారు.భక్తులకు ఆలయ ధర్మకర్త దేవర రమేష్ అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు.

పొదిలి : మండలంలో భోగిపండుగ సంబరాలు అంబరాన్ని అంటాయి. పల్లెలకు బంధుమిత్రుల రాకతో గ్రామాల్లో సంక్రాంతి సందడి నెలకొంది. దీంతో పలు గ్రామాల్లో ముగ్గులపోటీలు, ఆటలపోటీలు నిర్వహించారు. సోమవారం పలు గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం అన్ని గ్రామాలు, పట్టణంలో తెల్లవారుజాము నుంచే భోగిమంటలు వేసి ప్రజలు పండగను ఉత్సాహంగా నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న చీకటి జీవోల ప్రతులను దహనం చేశారు.

వైభవంగా గోదాదేవి రంగనాయకుల కల్యాణం

త్రిపురాంతకం : భోగి పర్వదినం సందర్భంగా గోదా రంగనాయకస్వామి కల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్థానిక ఎన్ఎస్పీ కాలనీలోని వెంకటేశ్వరాలయంలో అర్చకులు ఎం.రామశ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణ క్రతువు నిర్వహించారు. అర్చకులు కె.రవి ఆధ్వర్యంలో పాతరామాలయం వద్ద వేంకటేశ్వర కల్యాణాన్ని నిర్వహించారు. వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాద వితరణ చేపట్టారు

భోగి పర్వదినం సందర్భంగా ఇళ్ల ముంగిట రంగవల్లులు కొలువుతీరాయి. తెల్లవారుజామునే భోగిమంటలు వేశారు. స్థానిక శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో గోదాదేవి, రంగనాయకుని కల్యాణం నిర్వహించారు. అర్చకులు కొండవీటి సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు విశేషంగా హాజరై కళ్యాణ క్రతువును తిలకించారు.

మార్కాపురం వన్‌టౌన్ : జవహర్‌నగర్‌లోని లక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో భోగి సందర్భంగా గోదాదేవి, రంగనాథుల కల్యాణం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు డా. డీవీకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పాలెం.చెంచయ్యల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణ ఘట్టాలు నిర్వహించారు. ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు. లక్ష్మీ పద్మావతి సమేత వెంకంటేశ్వర స్వామి ఆలయంలో గోదాదేవి కళ్యాణం నిర్వహించారు.

కంభం : సంక్రాంతి వేడుకల్లో భాగంగా కోటా సత్యమాంబదేవి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వేంకటేశ్వరస్వామి దేవాలయంలో జరిగిన కల్యాణానికి భక్తులు విరివిగా తరలివచ్చారు. ఆంజనేయశర్మ అర్చకులు గోదాదేవి, రంగనాయకస్వామిలకు జీలకర్ర బెల్లం అనంతరం మాంగళ్యధారణ చేయించి తలంబ్రాలు పోశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, సాయంత్రం ఊంజల సేవ చేశారు.

వైభవంగా భోగి

ముండ్లమూరు : సంక్రాంతి పండుగలో భాగంగా తొలిరోజు భోగి పండుగను ఆదివారం ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. చిన్నారులు, వృద్ధులు, మహిళలు ఈ భోగి మంటల్లో పాల్గొన్నారు. మండలంలోని వేంపాడులో దర్శి నియోజక వర్గ జనసేన పార్టీ నాయకుడు గరికపాటి వెంకట్ భోగి వేడుకలో పాల్గొన్నారు. చిన్న పిల్లలకు భోగి పండ్లతో అభిషేకించారు.

కురిచేడు : మండల ప్రజలు భోగి పర్వదినాన్ని కోలాహలంగా నిర్వహించుకున్నారు. తెల్లవారుజామున భోగి మంటలు వేసి సరదాగా గడిపారు. నూతన వస్త్రాలు ధరించి ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. సోమవారం సంక్రాంతి పర్వదినానికి పట్టణాల నుంచి గ్రామస్తులు స్వగ్రామాలకు చేరుకున్నారు. దీంతో గ్రామాలు కళకళలాడుతున్నాయి.

దొనకొండ : అన్ని గ్రామాల్లో భోగిపండుగ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామునే లేచి ఇళ్లముందు భోగిమంటలు వెలిగించి కీడు తొలగిపోవాలని కోరుకొని భోగి మంటల చుట్టూ తిరుగుతూ ఆట పాటలతో సందడి చేశారు. నాలుగు రోడ్ల కూడలిలో ఆనంద ఆశ్రమంలో ధర్మకర్త కాకర్ల భైరవానందస్వామి నేతృత్వంలో భోగి పండుగ సందర్భంగా గణపతిపూజ, మహన్యాస పూర్వకం రమా సమేతా శ్రీ వీరవెంకట సత్య నారాయణ స్వామి వారి వ్రత కథలు పురోహితులు మణి బాబు శర్మ సురేష్ స్వాములు నిర్వహించారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఉడుముల

కొనకనమిట్ల, జనవరి 14 : మండలంలోని గొట్లగట్టు గ్రామంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామంలో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలు ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 35 టీంలు ఈ పోట్లో పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఎంపీపీ మురళీకృష్ణ వైసీపీ మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, సిసికేర్ శ్రీనివాస రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ పెదవెంకటరెడ్డి, నాయకులు ఉన్నం శ్రీను, ఏలూరి సంజీవరెడ్డి, నాగం వెంకటేశ్వర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు జనసేన ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు

దొనకొండ, జనవరి 14 : అడ్డరోడ్డులోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో 'మన ఊరు - మన ఆట సంక్రాంతి' సంబరాల్లో భాగంగా జనసేన దర్శి నియోజకవర్గ నాయకుడు గరికపాటి వెంకట్ సహకారంతో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు గుండాల నాగేంద్రసాద్ తెలిపారు.

దర్శిలో సంక్రాంతి హడావుడి



వేంపాడులో ముగ్గుల పోటీల విజేత సునీతకు బహుమతిని అందజేస్తున్న జనసేన నేత వెంకట్

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

దర్శి నియోజకవర్గంలో ఈ ఏడాది సంక్రాంతి పర్వదినం హడావిడి అధికంగా కనిపిస్తోంది. టీడీపీ, జనసేన, వైసీపీతోపాటు వివిధసంస్థల ఆధ్వర్యంలో వివిధ పోటీలు నిర్వహిస్తున్నారు. దర్శి నియోజకవర్గాన్ని ఎంచుకుని ప్రజాసేవ కార్యక్రమాలు చేపట్టిన జనసేన నేత వెంకట్ తొలుత నాలుగురోజులపాటు జాతీయ స్థాయిలో ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత రెండు రోజులపాటు మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి ఎడ్ల బండ లాగుడు పోటీలు నిర్వహించారు. ఆదివారం నుంచి జనసేన నేత వెంకట్ ఆధ్వర్యంలో వివిధ సేవ, క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. భోగి పర్వదినమైన ఆదివారం ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు వివిధ గ్రామాల్లో జరిగిన పలు రకాల పోటీల్లో వెంకట్ పాల్గొని విజేతలకు ప్రయోజకరమైన బహుమతులు ఇచ్చారు.

దర్శి : మండలంలోని తూర్పువీరాయపాలెంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు మహిళల నుంచి విశేష స్పందన లభించింది. విజేతలకు గరికపాటి వెంకట్ బహుమతులను అందజే శారు. కార్యక్రమంలో పలువురు జనసేన పార్టీ, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గరికపాటి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

ముండ్లమూరు : మండలంలోని వేంపాడులో సంక్రాంతి పండుగ సంబరాల్లో భాగంగా భోగి రోజు నియోజక వర్గ జనసేన పార్టీ నాయకుడు గరికపాటి వెంకట్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో మొదటి బహుమతి విజేత సునీతకు గరికపాటి వెంకట్ గ్రైండర్‌ను అందజేయగా, ద్వితీయ బహుమతిని లక్ష్మీ పూజితకు సీఐ మేదరమెట్ల వీరయ్య చౌదరి అందించారు. తృతీయ బహుమతి సాధించిన ముప్పనేని వెంకట శ్రావణికి తాళ్లూరి పెద నారాయణ స్వామి బహుమతిని అందజేశారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కన్సొలేషన్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో దర్శి మాజీ ఎంపీపీ ఫణిదపు వెంకట్రామయ్య, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కొక్కెర నాగరాజు, మేదరమెట్ల కొండలరావు పాల్గొన్నారు.

మండలంలోని ఈదర గ్రామంలో జనసేన, టీడీపీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించగా ప్రథమ బహుమతి కొండారు ప్రసన్న జ్యోతి, ద్వితీయ బహుమతి పులిచర్ల అనూష, తృతీయ బహుమతి నాగమల్లి దేవి, నాల్గవ బహుమతి కొండారు రాకేష్ నిలిచారు. వీరికి గరికపాటి వెంకట్ బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో దర్శి జనసేన పార్టీ నేత బొటుకు రమేష్, దిరిసాల ఏసురెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు నాగమల్లి అంకమరావు, నాగండ్ల రమణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు నాగరాజు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు తోట రామారావు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు

దర్శి, జనవరి 14 : బూచేపల్లి వెంకాయమ్మ, సుబ్బారెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విజేతలకు జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి ప్రథమ బహుమతి ఏసీ, రెండవ బహుమతి వాషింగ్ మిషన్, మూడవ బహుమతి ఫ్రిజ్, నాల్గవ బహుమతి టీవీలను అందజేశారు. పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. సంక్రాంతి సందర్భంగా దర్శిలో ముగ్గుల పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. సోమవారం రైతులకు ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్లు వీ వెంకటరెడ్డి, కేవీ రెడ్డి, మండల వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, వైసీపీ నాయకులు సద్ది పుల్లారెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : స్థానిక నాయుడు బజార్‌లో సంక్రాంతి సందర్భంగా మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సీనియర్ విభాగంలో సుభాషిణి, మంజులా, నాగమణి, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. సీనియర్ విభాగంలో రాగిణి, త్రివేణి, కీర్తిలు మొదటి, రెండు, మూడో బహుమతులు పొందారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, గుంటక వనజాక్షి, ఆర్‌కేజే నరసింహం, ఎస్వీకేపీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ బచ్చలకూరి డేవిడ్ సన్ తదితరులు పాల్గొన్నారు.

తర్లుపాడు : తర్లుపాడు చెరువు కట్ట వద్ద వెలసిన శ్రీ పోలేరమ్మ ఆలయం వద్ద భోగి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 60 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి కె.మాధవి, ద్వితీయ బహుమతి బి.కృష్ణవేణి, మూడో బహుమతి బి.స్రవంతి, నాలుగో బహుమతి సంధ్యలు విజయం సాధించారు.

పండుగ వేళ చిన్ననాటి స్నేహితులతో...!

ఘనంగా ఆత్మీయ సమ్మేళనాలు




మార్కాపురం, తర్లుపాడులో సమావేశమైన పూర్వ విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్ : పట్టణంలోని ఏబీఎం హైస్కూల్‌లో 2001-02 సంవత్సరానికి చెందిన పదోతరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. హవేలీ ఫంక్షన్ హాల్‌లో తమకు చదువులు నేర్పిన ఉపాధ్యాయులను విద్యార్థులు సన్మానించి గురు భక్తి చాటారు. అలనాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు.

రాచర్ల : మండలంలోని అనుమలవీడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1987-88 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. దాదాపు 70 మంది సమావేశంలో పాల్గొన్నారు. అనుమలవీడు ప్రభుత్వ పాఠశాలలోనే ఉపాధ్యాయులుగా పనిచేసిన తెలుగు పండిట్ శ్రీనివాసరావు, డ్రాయింగ్ మాస్టర్ సైదన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు అనేక మంది ఇంజనీర్లు, ఉపాధ్యాయులు కావడం సంతోషమన్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు గుంటూరు లూథరన్ ఎయిడెడ్ స్కూల్ హెచ్‌ఎం షేక్ షెక్షావలి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చప్పిడి శ్రీని వాసరావు, విశ్వభారతి స్కూల్ డైరెక్టర్ రంగ స్వామిరెడ్డి, హోండా షోరూం అధినేత వెంకట రామిరెడ్డి, అంబవరపు శ్రీనివాసరెడ్డి, బజాజ్ షోరూం మేనేజర్ రమణ, జూనియర్ అసిస్టెంట్ షెక్షావలి, సూరా మధుసూదన్‌రెడ్డి, మాధవి, మగ్బుల్, నీరజ, అనసూయ, వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, హెచ్‌ఎం బాలరాజు పాల్గొన్నారు.



రాచర్లలో గురువును సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

తర్లుపాడు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991-92సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వపు విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. 30 ఏళ్ల క్రితం చదువుకున్న రోజులు, వారు చేసిన అల్లరి, ఆట పాటలు, తమ స్నేహితులతో కలిసి ఆనందంగా పలకరించుకుని యోగ క్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం చదువులు నేర్పిన గురువులను జగ్గళ్లపూడి కృష్ణమూర్తి, ఎన్.బసిరెడ్డి, గ్గరె.శ్రీనివాసులు, డీవీ నారాయణ రెడ్డి, వడ్డమూడి వీరయ్యలను ఘనంగా దుశ్శాలువలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుధాకర్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీతోనే గిరిజనుల అభివృద్ధి

టీడీపీ వై.పాలెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు

పెద్ద దోర్నాల, జనవరి 14: గిరిజనుల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని, టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు కోరారు. మండలంలోని నల్లగుంట్ల, నల్లగుంట్ల బోడు గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ' కార్యక్రమం ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి గత ఐదేళ్లలో పెరిగిన నిత్యవసర వస్తువుల ధరల గురించి వివరించారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి పథకాలు, అందించిన సంక్షేమ పథకాల గురించి తెలియజేశారు. టీడీపీ సూపర్ పథకాలతో కూడిన గ్యారెంటీ పత్రాలను అందజేశారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు టీడీపీకి మద్దతుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, దేసు నాగేంద్రబాబు, షేక్ సమ్మద్‌బాష, చంటి, ఇస్మాయిల్, శ్రీనివాసులు, చల్లా వెంకటేశ్వర్లు, షేక్ భాష, మౌలాలి, పాల్గొన్నారు.



టీడీపీ గ్యారెంటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎరిక్షన్‌బాబు

టీడీపీలో 20 కుటుంబాలు చేరిక

మండలంలో నల్లగుంట్ల, చెంచుబోడు గ్రామాల్లో ఎరిక్షన్‌బాబు పర్యటిస్తున్న సందర్భంగా 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఎలకపాటి రాజయ్య ఆధ్వర్యంలో వీరు టీడీపీ కండువాలు కప్పుకున్నారు. ఎరిక్షన్‌బాబు వీరిని పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

గిద్దలూరు టౌన్ : సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆదివారం భోగి వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి ఆధ్వర్యం లో నాయకులు, కార్యకర్తలు జగన్‌రెడ్డి పాలనకు వ్యతిరే కంగా నినాదాలు చేస్తూ భోగిమంటల్లో ప్రజావ్యతిరేక జీవో ప్రతులను దహనం చేశారు. పట్టణంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న అశోక్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రంలో నెలకొన్న కీడు తొలగిపోవాలని, రానున్న రోజుల్లో టీడీపీ జనసేనల ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడితే రాష్ట్రంలో వెలుగులు నిండుతాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ పార్టీ అధ్యక్షులు సయ్యద్ షాన్షావలి, టీడీపీ నాయకులు బిల్లా రమేష్, శేషగిరి, మార్తాల సుబ్బారెడ్డి, పవన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌యాదవ్, తదితరులు ఉన్నారు.



ప్రజా వ్యతిరేక జీవో ప్రతులు దహనం చేస్తున్న అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్ : 'బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు టీడీపీ గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా కే.ఎస్.పల్లిలోని వడ్డెర కాలనీలో అశోక్‌రెడ్డి పర్యటించారు. ఇంటింకి తిరిగి టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశ పెడుతుందని వివరించారు. గతంలో మహిళల అభివృద్ధికి డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసిందని, సున్నా వడ్డీ వంటి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి పాలుగుళ్ళ ప్రతాపరెడ్డి, టీడీపీ నాయకులు కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

పొదిలిలో రక్తదాన శిబిరం

పొదిలి, జనవరి 14 : రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పొదిలి బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి మరొకరికి సాయం చేయాలన్నారు. ఎస్ఐ వెంకటసైదులు పాల్గొన్నారు. మొత్తం 40 యూనిట్ల రక్తం చేస్తున్నారు.

మానవతా స్వచ్ఛంద సేవా సంస్థకు విరాళం

పొదిలి, జనవరి 14 : పొదిలి మానవతా స్వచ్ఛందసేవ సంస్థకు ప్రముఖ వ్యాపారి కుటుంబం లక్షరూపాయలు విరాళం ప్రకటించింది. పట్టణంలోని దివంగత వందావళి కోటయ్య, భార్య లక్ష్మమ్మ జ్ఞాపకార్థం తమ్ముడు వెంకటేశ్వర్లు సంస్థకు విరాళం అందజేయనున్నట్లు తెలిపారు. ఆదివారం లక్ష్మమ్మ వర్ధంతి సందర్భంగా ప్రకటించారు. పొదిలిలో స్వచ్ఛందసేవ సంస్థ నిర్మాణం ప్రారంభం కాగానే ప్రకటించిన విరాళాన్ని అందించనున్నట్లు చెప్పారు. విరాళం ప్రకటించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

కలిసికట్టుగా పని చేయాలి

రాచర్ల, జనవరి 14 : రానున్న ఎన్నికలలో అందరూ కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉందని, జనసేన మండల అధ్యక్షులు పుట్టా బాలకృష్ణ అన్నారు. అనంపల్లెలోని జనసేన కార్యాలయంలో ఆదివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బాలకృష్ణ మాట్లాడుతూ జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశనిర్దేశం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కోళ్ల రంగసాయి, జి.వెంకటసుబ్బమ్మ, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, సాయన్న, కే.సురేష్, ఎ.రమేష్, రాజు, యామా రామక్రిష్ణ, పసుపులేటి గోపాల్, పి.ప్రభాకర్‌నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాటుసారా బట్టీలపై దాడులు

కొమరోలు, జనవరి 14 : మండలంలోని అల్లీనగరం పంచాయతీలోని యర్రగుంట్ల గ్రామ అటవీ ప్రాంతంలో అక్రమంగా నాటు సారాకాస్తున్న బట్టీలను గుర్తించి వాటిని ధ్వంసం చేసినట్లు ఎస్సై సుబ్బరాజు పేర్కొన్నారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు, నాటుసారా దుకాణాలు, పేకాట శిబిరాలు, కోడిపందేలు నిర్వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సంక్రాంతి పండుగను ప్రజలు శాంతియుతంగా నిర్వహించుకోవాలన్నారు. మండలంలోని యర్రగుంట్ల గ్రామ అటవీ ప్రాంతంలో ఈక్రమంగా నాటు సారాను కాస్తున్న బట్టీలపై దాడులు నిర్వహించి 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వసం చేశారు. గ్రామాల్లో సారాకాస్తున్నరనే సమాచారాన్ని స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

12 మద్యం సీసాల స్వాధీనం

పామూరు, జనవరి 14 : కర్నాటకకు చెందిన మద్యం బాటిళ్లను కారులో తరలిస్తుండగా పామూరు చెక్‌పోస్టు వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కనిగిరి ఎస్ఈబీ సీఐ జలీల్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్నాటక నుంచి పొన్నలూరు వస్తున్న కారును పామూరు మండలం తిరగళదిన్నె గ్రామం చెక్‌పోస్టు వద్ద పామూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామానాయక్, కనిగిరి ఎస్ఈబీ పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. కారులో మహేంద్రరెడ్డి అనే వ్యక్తి వద్ద నాలుగు ఫుల్, ఎనిమిది క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసినట్లు సీఐ జలీల్ తెలిపారు.

గుండెపోటుతో బీసీవై నాయకుడి మృతి



నాగేశ్వరయాదవ్

గిద్దలూరు టౌన్, జనవరి 14 : బీసీవైపార్టీ గిద్దలూరు నియోజకవర్గ నాయ కులు పెట్టెల నారాయణయాదవ్ (59) ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. ఇటీవల బీసీవై పార్టీస్థాపన నుంచి పార్టీలో ఆయన చురుగ్గా వ్యవహరిస్తున్నారు. నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు విశేషంగా కృషి చేస్తున్నారు. పది రోజులుగా గుండెకు సంబంధించి వ్యాధికి చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతిచెందారు. నారాయణ యాదవ్ బీసీవై పార్టీలో చేరక ముందు టీడీపీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. వ్యాపారరీత్యా తిరుపతిలో నివాసం ఉంటున్నారు. గిద్దలూరు మండలం నరవ బయనపల్లె గ్రామానికి చెందిన ఆయన అంత్యక్రియలు స్వగ్రామంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఒంగోలు బ్రాంచ్ కాలువలోకి సాగర్ జలాలు



ఓబీసీ వద్ద సాగర్ జలాలు

దర్శి, జనవరి 14 : తాగునీటి అవసరాల కోసం విడుదల చేసిన సాగర్ జలాలు ఆదివారం ఒంగోలు బ్రాంచ్ కాలువకు చేరాయి. మూడు రోజుల క్రితం డ్యామ్ నుంచి కుడి కాలువకు నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం సాగర్ డ్యామ్ నుంచి కుడి కాలువకు 4700 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. ఆ నీరు సాగర్ ప్రధాన కాలువ 85/3 మైలు (ప్రకాశంబార్డర్) వద్దకు వచ్చే సరికి 2200 నీరు పంపిణీ అవుతుంది. అక్కడ నుంచి దర్శి బ్రాంచ్ కాలువకు వచ్చే సరికి 1200 క్యూసెక్కులు, ఒంగోలు బ్రాంచ్ కాలువకు 600 క్యూసెక్కులు నీరు సరఫరా అవుతుంది. తాగునీటి చెరువులను నింపేందుకు మాత్రమే నీటిని విడుదల చేయడంతో ఎన్నెస్పీ అధికారులు అప్రమత్తమయ్యారు. నీటి చౌర్యం జరగకుండా నిరంతరం కాలువపై పర్యటిస్తున్నారు. దర్శి ఎన్ఎస్పీ డీఈ అక్బర్‌బాషా ఆధ్వర్యంలో సిబ్బంది అన్ని మేజర్లను పరిశీలిస్తున్నారు. మేజర్లు ఎత్తకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ సాగర్ జలాలను కేవలం తాగునీటి అవసరాలకే విడుదల చేసినందున రైతులు గుర్తించాలన్నారు. ఎవరైనా నీటి చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టీడీపీ ఆరోపణలు అవాస్తవం

- వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్

ఎర్రగొండపాలెం, జనవరి 14 : నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు జరగలేదని ప్రతిపక్ష టీడీపీ నాయకులు చేస్తున్న ప్రకటనల్లో నిజంలేదని, ఎర్రగొండపాలెం నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. ఎర్రగొండపాలెం ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నియోజకవర్గంలో నాలుగున్నరేళ్ల కాలంలో 1.84 లక్షల మందికి లబ్ధి చేకూరిందన్నారు. నియోజకవర్గంలోని వైసీపీనాయకుల్లో, కార్యకర్తల్లో ఎలాంటి విభేదాలు లేవని తెలిపారు. మొదటి సారి నియోజకవర్గంలో వస్తే ఘనస్వాగతం పలికారన్నారు. నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో వైసీపీకి గతంలో కంటే ఎక్కువ మెజార్టీ సాధించేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. ఈ ప్రాంతానికి సాగునీరు తాగునీరు అందించే వెలిగొండ ప్రాజెక్టును ఎన్నికల లోపు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనరు బీవీ.సుబ్బారెడ్డి, కె ఓబులరెడ్డి, జడ్పీటీసీ చేదూరి విజయబాస్కర్, మాజీ ఎఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీలు ఆళ్ల ఆంజనేయరెడ్డి, అమిరెడ్డి రామిరెడ్డి, మోర్తాల సుబ్బారెడ్డి, శ్రీశైలం ట్రస్టుబోర్డుమాజీ డైరక్టరు యుమ్మడిశెట్టి వెంకటసుబ్బారావు, ఎర్రగొండపాలెం సర్పంచి అరుణాబాయ్, పీడీసీసీబీ డైరక్టరు బాలగురవయ్య పాల్గొన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు,చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

భోగి మంటల్లో వైసీపీ చీకటి జీవోలు



వైసీపీ చీకటి జీవోలను భోగి మంటల్లో వేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉగ్ర, పామూరు టీడీపీ నేత పువ్వాడి, తాళ్లూరులో నిరసన

- జగన్‌రెడ్డి కీడును వదిలించుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పిలుపు
- ప్రజావ్యతిరేక కాపీలను తగులబెట్టి నిరసన

కనిగిరి, జనవరి 14: రాష్ట్రానికి పట్టిన జగన్ లాంటి కీడును ప్రజలందరూ ఏకమై వదిలించుకోవాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. అమరావతి గ్రౌండ్స్‌లో ఆదివారం వేకువజామున భోగి మంటల్లో జగన్‌రెడ్డి చీకటి జీవోలను, ఎఫ్ఐఆర్ కాపీలను తగులబెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందన్నారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఆర్థిక కష్టాలు పడుతున్నారన్నారు. మరోపక్క ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లనూ జగన్‌రెడ్డి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌రెడ్డికి ఓటుతో బుద్ధి చెప్పి గద్దె దింపాలని ఉగ్ర పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీకి అధికారాన్ని ఇవ్వడం రాష్ట్ర ప్రజల బాధ్యతగా భావించాలన్నారు. జగన్‌రెడ్డి అబద్ధపు, మోసపూరిత హామీలను నమ్మొద్దని సూచించారు. చంద్రబాబు పాలనలో ఏటా సంక్రాంతి కానుకలను అందిస్తే, వైసీపీ పాలనలో ప్రతి ఏటా ఏదో ఉద్యోగ, కార్మిక, కర్షక, శ్రామిక వర్గాలపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రజలు విజ్ఞతతో ఆలోచించి రాష్ట్ర భవిష్యత్ కోసం, కులాలకు, మతాలకు అతీతంగా టీడీపీని గెలిపించి, చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది సంక్రాంతి నుంచి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆనందంగా ఉండాలని ఉగ్ర ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గాయం తిరుపతిరెడ్డి, చావలి వెంకటేశ్వర్లుయాదవ్, సిద్ధాంతి బారాయిమాం, గండికోట రమేష్, చిలకపాటి లక్ష్మయ్య, షరీఫ్, కుంచెం జక్రయ్య, తెలుగు మహిళలు కరణం అరుణ పాల్గొన్నారు.

పామూరు : ప్రజలపై మోయలేని భారాలు మోపుతున్న వైసీపీపై నిరసన తెలుపుతున్న ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా జీవోలు చేయడం దుర్మార్గమని టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. టీడీపీ ఆధ్వర్యంలో భోగి వేడుకలను ఆదివారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి సూచన మేరకు వైసీపీ అరాచక, ప్రజా వ్యతిరేక జీవో ప్రతులను పువ్వాడి కల్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన భోగి మంటల్లో వేసి తగులబెట్టారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి అధికారం కట్టబెట్టి, ఉగ్రను భారీ మెజారిటీతో గెలిపించుకొని కనిగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలని, తద్వారా ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని పువ్వాడి పిలుపునిచ్చారు. సుబ్బక్కపల్లి, బొట్లగూడూరు, కంభాలదిన్నె, మోపాడు, కోడిగుంపుల, బోడవాడ. పడమటకట్టకిందపల్లి, పుట్టంనాయుడుపల్లి, అయ్యవారిపల్లి తదితర గ్రామాలతో పాటు పట్టణంలో టీడీపీ నాయకులు వైసీపీ జీవోలను భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ ఒంగోలు పార్లమెంట్ తెలుగు రైతు అధ్యక్షుడు ఏలూరి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ పువ్వాడి తిరుపతమ్మ, పువ్వాడి వెంకటలక్ష్మమ్మ, పువ్వాడి వెంకటేశ్వర్లు, సుజాత, జడ్పీటీసీ మాజీ సభ్యుడు బొల్లా మహాలక్ష్మమ్మ, ఎం.హుసేన్‌రావుయాదవ్, ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహారావు, టీఎన్ఎస్‌ఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి పోకా నాయుడుబాబు, టీడీపీ విభిన్న ప్రతిభావంతుల కమిటీ రాష్ట్ర కార్యదర్శి అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు ఎం.గంగరాజుయాదవ్, యారవ శ్రీనివాసులు, పువ్వాడి రామారావు, తెలుగు రైతు మండల అధ్యక్షుడు మన్నం రమణయ్య, తెలుగు యువత అధ్యక్షుడు ఉప్పలపాటి హరిబాబు, ఐటీడీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ మార్నేని రామకృష్ణ, దేవరపు మాల్యాద్రి, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు పాల్గొన్నారు.

దొనకొండ : సైకో జగన్ పాలన పై ప్రజలు విసిగిపోయారని ఎన్నికలు ఎ ప్పుడు జరిగినా టీడీపీ అధికారంలోకి రావటం ఖాయమని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి, మల్లంపేట మాజీ సర్పంచ్ వల్లపునేని వెంకటస్వామి తెలిపారు. భోగి పండుగ సందర్భంగా గ్రామంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైసీపీ ప్రజా వ్యతిరేక జీవో ప్రతులను, జగన్ చేతగాని హా మీలకు సంబంధించిన ప్రతులను వేసి వైసీపీ విడుదల చేసిన ప్రజా వ్యతిరేక జీవో ప్రతులను భోగి మంటల్లో వేసి తగులబెట్టి నిరసన తెలిపారు. అనంతరం గ్రా మ పార్టీ అధ్యక్షుడు వల్లపునేని వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు ఉన్నం శ్రీను, కుందేటి వెం కటేశ్వర్లు, గుమ్మా వెంకటేశ్వర్లు మరికొందరు కార్యకర్తలు సైకో పోవాలి సైకిల్ రావాలి అం టూ గ్రామంలో నినాదాలు చేశారు.

తాళ్లూరు : వైసీపీ చీకటి జీవోలను టీడీపీ నాయకులు భోగి మంటల్లో వేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం తురకపాలెంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. నాగంబొట్లపాలెంలో టీడీపీ బీసీ నేతలు పాశం సూరిబాబు, పిన్నిక రమేష్‌బాబు, శ్రేణులు భోగి మంటల్లో ప్రజావ్యతిరేక కాపీలను వేసి కాల్చివేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రగిరి గుర్వారెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ మస్తాన్‌రావును పరామర్శించిన వెంకట్

ముండ్లమూరు, జనవరి 14 : మండలంలోని పూరిమెట్ల గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ కోడిగ మస్తాన్‌రావు, ఆయన కుమార్తె బంగారమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చారు. విషయం తెలుసుకున్న దర్శి నియోజక వర్గ జనసేన పార్టీ నాయకుడు గరికపాటి వెంకట్ ఆదివారం పూరిమెట్ల వెళ్లి మస్తాన్‌రావును, ఆయన కుమార్తె బంగారమ్మను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయనవెంట తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కొక్కిర నాగరాజు, చింతపల్లి వెంకట స్వామి, ఒగులూరి నాగేశ్వరరావు, నారాయణ, పయ్యావుల ఏడుకొండలు, రమణాల ఏడుకొండలు, సిమ్మిలి ప్రసాద్ ఉన్నారు.

పేదలకు చీరల పంపిణీ

మండలంలోని కెల్లంపల్లి పంచాయతీ నందమూరినగర్ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కుంటా యోగేశ్వరమ్మ ఆధ్వర్యంలో 160 పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా పేదలకు చీరలు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కుంటా నాగేశ్వరరావు, బెల్లంకొండ కోటేశ్వరరావు, కుంటా పున్నయ్య, దియ్య శ్రీను, వెంకటరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ ఉగ్ర సమక్షంలో పార్టీలో చేరిన బొటికర్లపాడు గ్రామ దళితులు

టీడీపీలోనే దళితులకు సముచిత స్థానం

- వైసీపీని వీడి సైకిలెక్కిన బొటికర్లపాడు దళిత కుటుంబాలు
- పార్టీలోకి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, జనవరి 14 : తెలుగుదేశం పార్టీలోనే దళితులకు సముచిత స్థానం దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. అధికార వైసీపీని వీడి ఉగ్ర సమక్షంలో టీడీపీ నాయకుడు ముచ్చుమూరి చెంచిరెడ్డి ఆధ్వర్యంలో 15 దళిత కుటుంబాలు ఆదివారం పార్టీలో చేరాయి. టీడీపీ మహిళాశక్తి కార్యాలయంలో ఆదివారం ఉగ్ర వారికి టీడీపీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఉగ్ర మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలోనే దళిత వర్గాలకు అండగా ఉంటుందన్నారు. తాను కూడా దళితులకు సముచిత స్థానం కల్పిస్తానన్నారు. ఎలాంటి సమయంలోనైనా ఆపదలో ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. దళితుల పేరు చెప్పుకుని జగన్‌రెడ్డి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపైనే దాడులకు తెగబడ్డారన్నారు. దళితుల భూములను వైసీపీ నేతలు ఆక్రమణలకు తెగబడినా జగన్ నోరు మెదపడంలేదన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు పక్కదోవ పట్టించి, నిధులను దుర్వినియోగం చేశారని ఉగ్ర ఆరోపించారు. ఎస్సీ కాలనీలను అభివృద్ధి చేస్తానని జగన్‌రెడ్డి ఇచ్చిన హామీని తుంగలోకి తొక్కారన్నారు. వచ్చే ఎన్నికల్లో దళితులంతా ఐక్యతతో చంద్రబాబును గెలిపించాలని కోరారు. వైసీపీ అరాచకాలను ప్రజలకు తెలియజేయాలని వారికి సూచించారు. పార్టీలో చేరిన వారిలో కసునూరి శ్రీకృష్ణ, కామునూరి నరసింహులు, దాసరి లక్ష్మీనారాయణ, దాసరి చెన్ననారాయణ, లేటల నాగార్జున లేగల నాగభూషణం, లేగల చెన్నయ్య, అంబటి తియోఫ్లస్, కామునూరి చలపతి, లేగాల నరేంద్ర, అంబటి దేవదానం, కామునూరి భను, శ్రీహరి, వెంకటనరసయ్య ఉన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నంబుల వెంకటేశ్వర్లుయాదవ్, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం

తాళ్లూరు, జనవరి 14 : రామభద్రాపురం కోదండరామస్వామి దేవాలయంలో ఆదివారం గోదాదేవి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా నెల రోజులుగా స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. దంపతులు కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. వేద పండితులు సీతారామ దీక్షితులు ఆధ్వర్యంలో ఎన్.రాఘవరామ్ శ్రీనివాస దీక్షితులు, ధనుంజయ దీక్షితులు వేదమంత్రాలతో గోదాదేవి కల్యాణం నిర్వహించారు. అనంతరం కమిటీ వారు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

పామూరు, జనవరి 14 : సంక్రాంత్రి పండుగ సందర్భంగా టీడీపీ, జనసేన పార్టీల సౌజన్యంతో డాక్టర్ ఉగ్ర యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో తూర్పు కోడిగుడ్లపాడు ఎర్రమట్టి గ్రౌండ్‌లో ఆటల పోటీలు ఉత్సాహంగా సాగు తున్నాయి. మెగా క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం క్రికెట్ మ్యాచ్‌లో క్రీడాకారులు చక్కని ఆటతీరును కనపరిచారు. రెండవ రోజు 5టీంలు పోటీపడ్డాయి. పడమటకట్టకిందపల్లి టీంపై పామూరు రౌడీమెన్స్‌వేర్, ఇనిమెర్ల జట్టుపై డీపీపాలెం, పీ వైసీసీ టీంపై జైహనుమాన్, గండిపాలెం జట్టు పై ఫ్రెండ్స్ వారివర్స్, ఫార్నర్ ఫైటర్ జట్టుపై సల్మాన్ లెవన్స్ గెలుపొందాయి. గెలుపొందిన క్రీడాకారుకు టీడీపీ నాయకులు యారవ శ్రీనివాసులు, షేక్ ఖాజారహంతుల్లా షీల్డ్‌ను బ హుకరించారు. టీడీపీ నాయకులు జేఆర్‌కే ఫౌండేషన్ అధినేత కోటపాటి జనార్దనరావు ఆర్థిక సహకారంతో ప్రథమ బహుమతిగా రూ.30.116, టీడీపీ నాయకులు, యువ పారిశ్రామికవేత్త యారవ శ్రీనివాసులు సహకారంతో ద్వితీయ బహుమతికి రూ.20,116, టీడీపీ నాయకుడు రియల్టర్ దారపనేని సుబ్బారావు తృతీయ బహుమతిగా రూ.10,116 న మకూర్చారు. ఈనెల 18వ తేదీన ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా విజేతలకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర బహుమతల ను అందజేస్తారని నిర్వాహకులు షేక్ ఖాజ, షకీబ్, యాసీన్ వెల్లడించారు. కార్యక్రమంలో టీ డీపీ, జనసేన పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న క్రికెట్ ప్రీమియర్ లీగ్

పీసీపల్లి : సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని పెదయిర్లపాడు రాయల్‌నగర్‌లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ని యోజకవర్గ స్థాయి క్రికెట్ ప్రీమియర్ లీగ్‌ను ఆదివారం నిర్వహించారు. ఈ లీగ్‌లో 6 మండలాల నుంచి టీమ్‌లు పాల్గొన్నాయి. తొలిరోజు ఆట తీరు క్రికెట్ అభిమానులను అలరించింది. 3 రోజుల పాటు నిర్వహించే ఈ పోటీలు ఈనెల 16న ముగియనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ప్రథమ బహుమతికి మాదాసు రమేష్‌బాబు రూ.30,116, ద్వితీయ బహుమతికి మాదాసు మాధవరావు రూ.20,116 తృతీయ బహుమతికి కూడాల నగేష్, మహేష్ బ్రదర్స్ రూ.10,116 సహకారం అందజేస్తున్నారు. ఈ లీగ్‌ను జనసేన మండల పార్టీ అధ్యక్షుడు బందారు రాజు ప్రారంభించారు.

నేటి నుంచి మెగా వాలీబాల్ టోర్నీ

పీసీపల్లి : ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నేటి నుంచి మెగా వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పీసీపల్లిలో నిర్వహించే ఈ టోర్నీలో విజేత జట్టుకు వరిమడుగు టీడీపీ నాయకుడు మోతుకూరి భీమయ్య రూ.15, 116, ద్వితీయ బహుమతిని తలకొండపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మాచర్ల రూ.10, 116, తృతీయ బహుమతి కింద జనసేన మండల పార్టీ అధ్యక్షుడు బందారు రాజు రూ.5,116 బహుమతిగా అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 8008680200, 799575 8817 నెంబర్లను సంప్రదించాలని వారు కోరారు.



కూలిన షెడ్.. ప్రమాదంపై జీఎంతో మాట్లాడుతున్న డీఎస్పీ

మెగా ఫుడ్ కోర్ట్ దగ్ధం

- అగ్ని కీలలధాటికి కూలిన భారీ షెడ్
- మంటలను అదుపు చేయడానికి ఎక్కువ సమయం
- ఒక్క ఫైరింజన్ మాత్రమే అందుబాటులోకి
- రూ.60 కోట్ల ఆస్తి నష్టం

కురిచేడు, జనవరి 14 : కురిచేడు మండలం ముష్టగంగవరం గ్రామం వద్ద గుండ్లకమ్మ నది పక్కనే ప్రభుత్వ ఆర్థిక సాయంతో ఎస్‌హెచ్ మెగా ఫుడ్ పార్క్‌ను 2019 సంవత్సరంలో 60 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేశారు. ఈ ఫుడ్ పార్క్‌లో శనివారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించి షెడ్ కూలిపోవడంతోపాటు యంత్రాలు కాలి బూడిదయ్యాయి. మొత్తం రూ.60 కోట్ల నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. ఈ విషయమై కురిచేడు పోలీస్ స్టేషన్‌లో ఫుడ్ పార్క్ యాజమాన్యం ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేపట్టారు. ముష్టగంగవరం గ్రామం వద్ద ఏపీ ప్రభుత్వ సహకారంతో ఎస్‌హెచ్ మెగా ఫుడ్ పార్క్‌ను ఏర్పాటు చేశారు. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, శ్రీనివాస ఫార్మ్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా ఈ పార్క్‌ను ఏర్పాట్లు చేశారు. 60 ఎకరాల స్థలం దీనికి కేటాయించగా 5 ఎకరాల విస్తీర్ణంలో భారీ షెడ్‌ను నిర్మించారు. కోడి గుడ్ల ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభించారు. ఇక్కడ కోడిగుడ్లలో తెలుపు, పచ్చ సొనను వేరు చేసి తెల్ల సొనను శుభ్రం చేసి పాశ్చరైజేషన్ చేసి ఎగుమతి చేశారు. ఒక్క గంటలో లక్ష కోడి గుడ్లు ప్రాసెస్ చేసే సామర్థ్యం గల భారీ మిషన్‌లు ఉన్నాయి. కోళ్లు, మేకలను ప్రాసెస్ చేసే యూనిట్లను సైతం ఏర్పాటు చేశారు. అవి ఇంకా ప్రారంభం కాలేదు. ఈ యంత్రాలన్నీ ఒకే భారీ షెడ్డులో ఏర్పాటు చేశారు. ఈ పనులన్నీ చేయడానికి, యంత్రాలతో పని చేయించడానికి 12 మంది సిబ్బంది ఉన్నారు. శనివారం సాయంత్రం పనులు ముగించుకున్న సిబ్బంది సాయంత్రం 6 గంటలకు బయటకు వచ్చారు. రాత్రి 8 గంటల సమయంలో సెక్యూరిటీ సిబ్బంది షెడ్ నుంచి పొగలు రావడాన్ని గమనించారు. వారు అక్కడికి చేరుకునేలోపే అగ్ని ప్రమాదాన్ని గుర్తించే సైరన్‌లు మోగాయి. సిబ్బంది అగ్నిమాపక యంత్రాలతో మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. వినుకొండ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ఫైర్ ఆఫీస్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేసే ప్రయత్నాలు చేశారు. ఈలోపే భారీ షెడ్‌లో మంటలు పెద్ద ఎత్తున ఎగిసిపడడంతో కూలిపోయింది. భారీ యంత్రాలు ఆహుతయ్యాయి. కోడిగుడ్లు నిల్వ చేసే అట్టలు లోపల ఉండడంతో మంటలు త్వరగా అంటుకున్నాయి.

వినుకొండ నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేసే ప్రయత్నాలు పారంభించారు. వైపాలెం, దర్శి నుంచి అగ్నిమాపక వాహనాలు రావల్సి ఉండగా రాలేదు. దర్శిలో అగ్నిమాపక యంత్రం ఖాళీగానే ఉన్నది. తమకు వినుకొండ అగ్నిమాపక కార్యాలయం నుంచి సమాచారం రాలేదని వారు తెలిపారు. ఒక్క అగ్నిమాపక యంత్రంతోనే మంటలను అదుపుచేయడానికి రాత్రి 12 గంటలైంది. దీంతో నష్టం విలువ పెరిగింది. మరో యంత్రం వస్తే మంటలు అదుపులోకి వచ్చేవని అక్కడి వారు అంటున్నారు.

అగ్ని ప్రమాదం జరిగిన తీరుపై కురిచేడు పోలీసులు విచారణ చేపట్టారు. శనివారం రాత్రి కురిచేడు ఎస్ఐ దేవకుమార్ వెళ్లి పరిశీలించారు. ఆదివారం ఉదయం దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్‌రెడ్డి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. అక్కడి సిబ్బందితో మాట్లాడారు. ప్రమాదం జరిగిన తీరు, నష్టపోయిన వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదు ఇస్తే విచారణ చేస్తామని తెలిపారు. విద్యుత్ శాఖ విచారణ అనంతరం బూడిద శాంపిళ్లను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించి పరీక్షలు చేయించి ప్రమాదం ఎలా జరిగిందో తెలుసుకునే ప్రయత్నం చేస్తామని తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తోనే..

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్ని ప్రమాదం జరిగినట్లు తెలుస్తున్నది. సిబ్బంది ఎవరికీ ప్రాణ నష్టం జరుగలేదు. పొగలు చూసిన వెంటనే మా సిబ్బంది ఇక్కడున్న అగ్నిమాపక యంత్రాలతో మంటలను అదుపుచేసే ప్రయత్నాలు చేశారు. అనంతరం అగ్నిమాపక కేంద్రాలను సమాచారం ఇచ్చారు. మొత్తం రూ.60 కోట్ల వరకూ నష్టం ఉంటుందని అంచనా. కురిచేడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం.

- బీఎస్ఎల్ ప్రసాద్, పార్క్ జనరల్ మేనేజర్


సంక్రాంతి శుభాకాంక్షలు
ప్రజా పరిచయ వేదిక
నిండైన ఆశీస్సుల వేడుక
దగ్గుమళ్ళ ఆత్మీయ కలయిక...
బాపట్లలో ప్రజా పరిచయ వేడుక...
ఇది ప్రజల ఆశీర్వాద కానుక...
ప్రజా సేవకు కావాలి ఇది వేదిక
తెలుగుదేశంపార్టీ అధినేత శ్రీ చంద్రబాబు నాయుడు గారి ప్రోత్సాహంతో బాపట్ల పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశం రావాలన్నా ఆకాంక్షతో ఏర్పాటు చేసిన ప్రజా పరిచయ వేదికకు భారీ ఎత్తున విచ్చేసిన అభిమాన జనానికి, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాము.
భవిష్యత్తులో ఇదే విధమైన మీ సంపూర్ణ సహకారం కోరుతూ...
తెలుగుదేశం పార్టీ
మీ..
దగ్గుమళ్ళ ప్రసాదరావు
IRS (చిన్నబుజ్జి)
బాపట్ల పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ నాయకులు



87 రోజులు ఓపిక పట్టండి

- అమరావతికి అంతా శుభ గడియలే
- అమరావతి అందరిదీ.. దానితోనే సంపద సృష్టి
- ఉమ్మడి ప్రభుత్వంలో బంగారం లాంటి రాజధాని నిర్మాణం
- 'భోగి సంకల్పం' కార్యక్రమంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్
- మందడంలో అట్టహాసంగా టీడీపీ- జనసేన భోగి వేడుకలు

తుళ్లూరు/గుంటూరు, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): '87 రోజులు ఓపిక పట్టండి.. అమరావతి నుంచే ప్రజా పాలన మొదల వుతుంది. రాష్ట్రంలో వచ్చేది జనసేన- టీడీపీ ప్రభుత్వమే. మన ప్రభుత్వం వచ్చాక బంగారంలాంటి రాజధానిని నిర్మించుకుం దాం. టీడీపీ జనసేన ప్రభుత్వం రాష్ట్ర ప్రజల కష్టాలు తీర్చడానికి పనిచేస్తుంది.. 'ఏం అనుమానం వద్దు.. మంచి రోజులు వస్తున్నాయి. శుభ గడియలు తలుపు తడుతున్నాయి. వైసీపీ విముక్త రాష్ట్రం కోసం అందరూ ఒకదారిలోకి రావాలి..' అని టీడీపీ, జనసేన అధి నేతలు చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ తెలిపారు. రాజధాని గ్రామమైన మందడంలో ఆదివారం 'తెలుగుదేశం- జనసేన భోగి సంకల్పం' అట్టహాసంగా జరిగింది. రైతులు, మహిళలు, రైతుకూలీలు, ఇరు పార్టీల కార్యకర్తలు, నేతలు భారీగా తరలిరావడంతో మందడంలోని గోల్డెన్‌రూల్ హైస్కూలు ప్రాంగణంలో ఆదివారం తెల్లవారుజాము నుంచే సందడి నెలకొంది. తొలుత భోగి మంటలు వేసి చీకటి జీవో ప్రతులను తగలబెట్టారు. మహిళలు వేసిన సంక్రాంతి ముగ్గులను పరిశీలించిన ఇరు పార్టీల అధినేతలు వారిని అభినందించారు. గంగిరెద్దులు, జోడెడ్ల బండిని పరిశీలించి, మహిళలు చేసిన పొంగళ్లు రుచిచూశారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ అమరావతి దుస్థితిని చూస్తే ఆవేదన, ఆందోళన కలుగుతోందన్నారు. భస్మాసురుడికి భోళా శంకరుడు వరమిచ్చినట్లు ప్రజలంతా జగన్‌కు వరమిస్తే, భస్మాసురుడిలా జగన్ అన్నివర్గాల ప్రజల నెత్తిన చేతులు పెట్టాడన్నారు. పండుగ భోగి కాగా పాలకుడు మానసిక రోగి అన్నారు. పోలీసులు చర్యలు తీసుకోవాల్సి వస్తే మానసిక రోగమున్న జగన్‌పై తీసుకోవాలే కాని ప్రజలపై కాదని చెప్పారు. అంగన్‌వాడీలను పండుగ రోజుల్లో రోడ్లపైకి తెచ్చిన ఘనత జగన్‌దన్నారు. అమరావతిలో పోలీసులు చేసిన అరాచకాలు రాక్షసులు కూడా చేసి ఉండరన్నారు. రేపటి రోజున వాళ్లే రైతులకు సెల్యూట్ చేస్తారని, అలా చేయిస్తానని హామీ ఇచ్చారు. అమరావతిలో 35 వేల ఎకరాలున్నాయని, అది 3 లక్షల కోట్ల సంపద కాగా దానిని జగన్ పాడుబెట్టాడని, దానిని వినియోగించుకునే మనం సంపద సృష్టించి ప్రజలకు ఇస్తామని తెలిపారు. పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ వైసీపీ మళ్లీ వస్తే రాష్ట్రంలో అంధకారం నెలకొంటుందన్నారు. టీడీపీ జనసేన ప్రభుత్వం ఏర్పడుతుందని, అమరావతే రాష్ట్ర ఏకైక రాజధానిగా ఉండి అభివృద్ధి కొనగుతుందన్నారు. వచ్చే సంక్రాంతి వేడుకలు ఇక్కడే ఉమ్మడి ప్రభుత్వంలో అద్భుతంగా జరుపుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నేతలు వర్ల రామయ్య, బుద్దా వెంకన్న, మాగంటి బాబు, నాదెండ్ల మనోహర్, తెనాలి శ్రావణ్‌కుమార్, కోవెలమూడి నాని, నసీర్, డేగల ప్రభాకర్, బూర్ల రామాంజనేయులు, బోన బోయిన శ్రీనివాస్ యాదవ్, గాదె వెంకటేశ్వరరావు, కొలికపూడి శ్రీనివాసరావు, పువ్వాడ సు. దాకర్, వేములకొండ శ్రీనివాస్, మన్నవ వంశీకృష్ణ, ఈరంటి బాబు, రాజధాని రైతులు, రైతు కూలీలు, మహిళలు పాల్గొన్నారు.





మహిళల పొంగళ్లు





ముగ్గులను పరిశీలిస్తున్న చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్ తదితరులు, కార్యక్రమానికి హాజరైన ప్రజలు



కోడీ.. కోట్లాట



- తీరంలో జోరుగా పందాలు
- బరుల వద్ద బౌన్సర్లు..
- విజేతలకు బుల్లెట్లు
- కీలక నేతల ఒత్తిళ్లతో చేతులెత్తేసిన పోలీసులు
- నిజాంపట్నం పోలీస్‌స్టేషన్ కూతవేటు దూరంలో బరులు

రేపల్లె, భట్టిప్రోలు, కొల్లూరు, వేమూరు, జనవరి 14: కోడిపందాలు జరగడానికి వీల్లేదు.. కఠిన చర్యలు తీసుకుంటాం.. అని శనివారం వరకు పోలీసులు హడావుడి చేశారు.. తీరా ఆ సమయం వచ్చేసరికి చేతులెత్తేశారు. ఆదివారం భోగితో తీరంలో కోడి పందాలు జరిగాయి. అధికారపార్టీ నేతలు ఎక్కడికక్కడ బరులు ఏర్పాటు చేసి జోరుగా కోడిపందాలు నిర్వహించారు. మొదటిరోజున రూ.లక్షల్లో పందాలు సాగాయి. వైసీపీ నేతల సారథ్యంలో పందాలు జరగడంతో అటువైపు పోలీసులు కన్నెత్తి చూడలేదు. కోడి పందాల ముసుగులో గుండాట, పేకాట, మట్కా, మూడు ముక్కలాట యథేచ్ఛగా నిర్వహించారు. బరుల వద్ద బౌన్సర్లు నియమించి భారీ ఈవెంట్‌లాగా కోడిపందాలు నిర్వహించారు. కొన్ని బరుల వద్ద ప్రవేశ రుసుం కూడా వసూలు చేశారు. గుంటూరు, పల్నాడు, కృష్ణా, ప్రకాశం, జిల్లాలతో పాటు తెలంగాణ ప్రాంతం నుంచి వేలాదిగా జూదరులు తరలివచ్చారు. పందాన్ని బట్టి 10 నుంచి 20 శాతం కమీషన్లు వసూలు చేశారు. మహిళలు సైతం పందాలను వేసేందుకు, చూసేందుకు భారీగా తరలివచ్చారు. వీఐపీ పందాల్లో పాల్గొన్న వారికి అల్పాహారంగా డ్రై ఫ్రూట్స్‌తోపాటు నాటుకోడి, మటన్‌తో భోజనం అందజేశారు. తొలిరోజు ఆయా ప్రాంతాల్లో 15 వందలకు పైగానే కోడి పందాలు జరగ్గా రూ.కోట్లలో చేతులు మారినట్లు సమాచారం. బరుల సమీపంలోనే మద్యం యథేచ్ఛగా అమ్మకాలు జరిపినా సెబ్, పోలీసు అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. బరుల వద్ద నెంబర్లాట, గుండాట నిర్వహించారు. గుట్కా విక్రయ కేంద్రాలతో పాటు బిర్యాని పాయింట్లను కూడా ఏర్పాటు చేశారు. అధికారులకు రూ.లక్షల్లో మామూళ్లు ముట్టచెప్పాము, వారు ఇటువైపు రారని భరోసా ఇచ్చి మరీ నిర్వాహకులు పందాలు నిర్వహించారు. బరుల సమీపంలోని లైన్ల నుంచి వైర్లు వేసుకుని భారీ ఫ్లెడ్‌లైట్లను ఏర్పాటు చేశారు. నిజాంపట్నంలో అధికార పార్టీ ప్రధాన నాయకుడి ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో పది బరులను ఏర్పాటు చేశారు. రూ.10 వేలు, రూ.20 వేలు, రూ.50 వేలు వరకు వేర్వేరుగా బరులను ఏర్పాటు చేసి రూ.లక్షల్లో పందాలు నిర్వహించారు. వీఐపీ బరుల్లో లక్ష నుంచి రూ.3 లక్షల వరకు పందాలు చేపట్టారు. గుడారాలు వేసి పేకాట, కోతముక్క నిర్వహించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ద్విచక్రవాహనానికి రూ.100, కార్లకు రూ.200 వసూలు చేశారు. రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, వైసీపీ రేపల్లె ఇన్‌చార్జ్ ఈవూరి గణేష్, మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జున్‌రావు, నగరం ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య దగ్గర ఉండి కోడి పందాలు నిర్వహించారు. భట్టిప్రోలు మండలం ఓలేరు వద్ద జాతీయ రహదారి 216 పక్కన బరుల వద్దకు వివిధ ప్రాంతాల నుంచి పుంజులతో పందాలకు తరలివచ్చారు. కొల్లూరు మండలం పెసర్లంక వద్ద బరిలో నిర్వాహకులు బౌన్సర్లను నియమించి పందాలు చేపట్టారు. ఒకే వ్యక్తి ఏడు పందాల్లో నాలుగు పందాలు గెలిస్తే బహుమతిగా బుల్లెట్ ఇస్తామని నిర్వాహకులు ప్రకటించగా కొల్లిపర మండలం వల్లభాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సొంతం చేసుకున్నారు. సోమవారం ఉదయం రూ.25 లక్షల పందాలు జరుగుతాయని నిర్వాహకులు బరి వద్ద ప్రచారం చేశారు. ఆదివారం ఒక్కరోజే సుమారు రూ.5 కోట్లకు పైగా చేతులు మారాయి. వేమూరు మండలం వరహాపురంలో ఓ కౌలు రైతు భూమిలో బరి ఏర్పాటు చేసి పందాలు చేపట్టారు. సినీనటుడు బ్రహ్మాజీ, ఎంపీపీ మోహన్‌రావు, యార్డు మాజీ చైర్మన్ ఏడుకొండలు తదితరులు హాజరయ్యారు.



నిజాంపట్నంలో భారీ జన సందోహం మధ్య హోరాహోరీగా కోడిపందాలు



పందాల వద్ద ద్విచక్ర వాహనాలు



కోడిపందాల బరుల వద్ద పేకాట



వేమూరు : వరహాపురంలో కోడి పందాల బరి



ఓలేరులో ఢీ కొంటున్న కోడి పుంజులు

పరిచయ వేదిక విజయవంతం

- రాష్ట్ర భవిష్యత్‌కు చంద్రబాబు అవసరం
- రాధేయ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ గ్రూప్ అధినేత దగ్గుమళ్ల రాధేయ్

బాపట్ల, జనవరి 14: బాపట్ల క్రిస్టియన్ భవన్ ప్రాంగణంలో శనివారం జరిగిన ప్రజాపరిచయ వేదికకు ప్రజలు, నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేశారని రాధేయ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ గ్రూప్ అధినేత దగ్గుమళ్ళ రాధేయ్ తెలిపారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన పరిచయ వేదిక కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. పరిచయ వేదిక విజయవంతమైన సందర్భంగా ఆదివారం అనుచరులతో కలిసి రాధేయ్ బాణసంచా కాల్చి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్‌కు నారా చంద్రబాబునాయుడు నాయకత్వం అవసరమన్నారు. ఆయన నాయకత్వంలో పనిచేసేందుకే తామంతా పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఉద్యోగ, వ్యాపార, సేవారంగాలలో విశిష్ట ఖ్యాతినార్జించిన ప్రసాదరావు రాజకీయాల్లోకి వచ్చి ప్రజలకు మెరుగైన సేవలందించాలనే సంకల్పంతో ఉన్నారన్నారు. ప్రజల అభీష్టం మేరకు టీడీపీ నుంచి పోటీ చేసి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాధేయ్ ఇంఫ్రాస్ట్రక్చర్ గ్రూప్ అధినేత దగ్గుమళ్ళ రాధేయ్ తదితరులు

సంప్రదాయంగా భోగి

అద్దంకి, జనవరి 14: సంక్రాంతి పండుగ మొదటి రోజు భోగి పండుగను ఆదివారం సంప్రదాయంగా జరుపుకున్నారు. ఆదివారం వేకువజామునే ఇళ్ల ముందు పోటీలుపడి భోగి మంటలు వేశారు. మహిళలు ఇళ్ల ముందు రంగవల్లులు వేశారు. తలంటు స్నానాలు చేసి పూజలు నిర్వహించారు. అద్దంకి పట్టణంలోని హరిహర గోకులంలో భోగి పండుగను నిర్వహించారు. భోగి మంటలు వేశారు. కాగా, మండలంలోని మణికేశ్వరంలో రాష్ట్రానికి పట్టిన కీడు తొలగాలని, రాష్ట్ర, నియోజకవర్గంలోని సమస్యల ఫొటోలను, జగన్ ప్రభుత్వ అక్రమ జీవో ప్రతులను టీడీపీ శ్రేణుల ఆధ్వర్యంలో భోగి మంటలలో వేసి తగులబెట్టారు.

చినగంజాం: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం భోగి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పర్వదినం వేడుకలు ఆదివారం భోగి మంటలతో ప్రారంభమయ్యాయి. వేకుమజాము నుంచే గ్రామాల్లోని పెద్దలు, యువకులు, చిన్నారులు, ప్రధాన రహదారుల్లోని కూడళ్లలో, ఇళ్ల ముందు ఆనందోత్సాహాలతో భోగి మంటలు వేశారు. మహిళలు ఇంటి ముందు రంగవల్లులు తీర్చిదిద్ది వాటిపై గొబ్బెమ్మలను ఉంచి పూలతో అలంకరించారు. ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దూర ప్రాంతాల నుండి వచ్చిన బంధువులు, స్నేహితుల రాకతో పల్లెలోని లోగిళ్లన్ని కళకళలాడాయి.

మార్టూరు: యద్దనపూడి మండలంలోని చిలుకూరివారిపాలెంలో ఆదివారం సినీ దర్శకుడు అనిల్ రావిపూడి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంక్రాంతి పండుగకు స్వగ్రామమైన చిలుకూరివారిపాలెం వచ్చారు. ఈ సందర్భంగా అభిమానులు ఆయనతో క్యాలెండర్‌ను ఆవిష్కరింపచేశారు. కార్యక్రమంలో కె.కృపారావు, కె.దినేష్, కె.కరుణాకర్, కె.రంగానాయక్, బి.తిమోతీనాయక్ పాల్గొన్నారు.

సినీ రాజకీయ ప్రముఖులతో కారంచేడులో సందడి

కారంచేడు(పర్చూరు), జనవరి 14: సినీ రాజకీయ ప్రముఖులతో కారంచేడు గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. హీరో దగ్గుబాటి రాణాతోపాటు అభిరామ్, నిర్మాత దగ్గుబాటి సురేష్, మరి కొంతమంది సినీ నటులు కారంచేడుకు చేరుకున్నారు. వీరితో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, మాజీ మంత్రి వెంకటేశ్వరరావు, తనయుడు ఇతేష్ చెంచురామ్ కుటుంబసభ్యులతో కలసి గ్రామానికి చేరుకున్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆదివారం వేకువజామున దగ్గుబాటి వెంకటేశ్వరరావు, దగ్గుబాటి రామానాయుడు నివాసాల వద్ద భోగిమంటలు వేసి సంబరాలు జరుపుకున్నారు.

కానరాని సంక్రాంతి

» జాడలేని హరిదాసులు, గంగిరెద్దులు
» కనుమరుగవుతున్న సంప్రదాయాలు
» పలుచోట్ల సందడిచేస్తున్న ఆటలపోటీలు



అద్దంకి, జనవరి 14: ఒకప్పుడు సంక్రాంతి పండుగ వస్తుందంటే నెలరోజుల ముందు నుంచే గంగిరెద్దులు, హరిదాసులు వీధుల వెంట తిరిగేవారు. మారిన సంప్రదాయాలు, సంస్కృతి నేపథ్యంలో కనీసం సంక్రాంతి పండుగ రోజు కూడా గంగిరెద్దులు, హరిదాసులు జాడ కూడా కనిపించటం లేదు. ఇటీవలవరకు అప్పుడప్పుడు కనిపించే హరిదాసులు గత రెండు, మూడు సంవత్సరాలుగా వెతికినా కనిపించటంలేదు. నాటి సంప్రదాయాలను కొనసాగించే హరిదాసుల కుటుంబాలు లేకపోవటంతో క్రమేపి హరిదాసుల జాడ లేకుండా పోయింది. ఇక గంగిరెద్దులు కూడా సంక్రాంతి పండుగ తరువాత పశ్చిమ ప్రకాశం జిల్లాలోని పలుగ్రామాలకు చెందిన వ్యక్తులు పొలం పనులు పూర్తయిన తరువాత భిక్షాటనగా మాత్రమే గంగిరెద్దులతో వస్తున్నారు. దీంతో నేటితరం పిల్లలకు హరిదాసులు, గంగిరెద్దుల గురించి వినటమే కాని ప్రత్యక్షంగా చూడటం కష్టంగానే మారింది.

సంక్రాంతి అంటే ఆటల పోటీలు..

ఇటీవల కాలంలో అద్దంకి ప్రాంతంలో సంక్రాంతి అంటే క్రీడల పోటీలు, పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు గుర్తుకు వస్తున్నాయి. రావినూతలలో జరిగే అంతరాష్ట్ర క్రికెట్ పోటీలకు పలు రాష్ట్రాల నుంచి క్రీడాకారులు వస్తారు. ఇటీవల కాలంలో కొండమంజులూరులో కూడా క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో ఈ ఏడాది కొత్తగా కొండమంజులూరులో మహిళా కబడ్డీ పోటీలను ఆదివారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. ఇతర ప్రాంతాలలో కూడా స్థానికంగా క్రికెట్, టెన్నిస్ పోటీలు నిర్వహిస్తున్నారు. పలు సంస్థల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు కూడా నిర్వహిస్తున్నారు. సంక్రాంతికి ఇతర ప్రాంతాలలో స్థిరపడ్డ కుటుంబాలలో అత్యధిక శాతం స్వగ్రామాలకు వస్తుంటారు. అప్పట్లో స్వ గ్రామంలోనే విద్యాభ్యాసం జరిగి ఉండటంతో పూర్వ విద్యార్థుల కలయిక పేరుతో సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు అందుబాటులో ఉంటే సన్మానాలు చేసి, నాటి జ్ఞాపకాలను పంచుకుంటున్నారు. ఇలా నాటి సంక్రాంతి సంప్రదాయాలు క్రమేపి కనుమరుగవుతూ కొత్త పద్ధతులు వస్తున్నాయి. ఏదొకవిధంగా సంక్రాంతికి ఒకచోటకు చేరి ఆనందాలు పంచుకుంటూ సంతోషంగా గడుపుతున్నారు.

అన్నిరంగాల్లో మహిళలు రాణించాలి

» కబడ్డీ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

పంగులూరు, జనవరి 14: చదువుతో పాటు క్రీడలు, ఇతర రంగాలలో మహిళలు రాణించాలని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సంక్రాంతి సందర్భంగా కొండమంజులూరులో తెలుగుయువత ఏర్పాటుచేసిన రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలను ఆదివారం రాత్రి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా చింతల సహదేవుడు అధ్యక్షతన జరిగిన సభలో గొట్టిపాటి మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా గ్రామీణ ప్రాంతమైన కొండమంజులూరులో రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహిస్తున్న తెలుగుయువతను అభినందించారు. గెలుపు, ఓటములను క్రీడాస్ఫూర్తితో స్వీకరించాలని క్రీడాకారులకు సూచించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, కేవీ సుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు, బొప్పుడి నాగేశ్వరరావు, కల్లూరి కోటేశ్వరరావు, సందిపాగు శరత్‌బాబు, కొలకలూరి సుబ్బయ్య, నాగ రాజు, సుధాకర్, వినోద్, బ్రహ్మయ్య, గోపి పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్, పోటీలో తలపడుతున్న మహిళా జట్లు

సంక్రాంతి ప్రతిఇంటా ఆనందాన్ని నింపాలి

అద్దంకి, జనవరి 14: తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాలలో నెలకొనే సందడి అనిర్వచనీయమని అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుత విధ్వంస పాలనతో ప్రతిఒక్కరి జీవితం చీకటిమయంగా మారిందన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధరలు లేవన్నారు. ప్రభుత్వ విద్వేష విధానాలతో యువత రోడ్డున పడిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. సైకో పాలనకు చరమగీతం పాడి వచ్చే సంక్రాంతి అందరి జీవితాలలో నూతన వెలుగులు నింపాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

కాగా, పట్టణంలోని కాకానిపాలెంలో రుక్మిణి శ్రీకృష్ణ స్వామి శాంతి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ నేతలు సందిరెడ్డి శ్రీనివాసరావు, గార్లపాటి శ్రీనివాసరావు, చుండూరి మురళీసుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

మంచిరోజు చూసుకొని చీరాల వస్తా: వెంకటేష్

చీరాల, జనవరి 14: మంచిరోజు చూసుకొని చీరాల వస్తానని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. 22న జరిగే సాధికార బస్సుయాత్రను విజయవంతం చేద్దామన్నారు. వెంకటేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడి, హైదారాబాద్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి ఒంగోలులోని తన నివాసానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న చీరాల నియోజకవర్గానికి చెందిన పలువురు కౌన్సిలర్లు, నాయకులు, అధికారులు వెంకటేష్‌ను ఆదివారం కలసి పరామర్శించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ బోయినవారిపాలెంలో జరిగిన ప్రమాదంలో గాయపడిన ఘటన గురించి వివరించారు. మీ అందరితో కలసి మాట్లాడుతుంటే కాలు నొప్పి కూడా తెలియడంలేదని చెప్పారు. అంతకుముందు మంత్రి మేరుగ నాగార్జున, వైసీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు నాగ్‌చంద్, తదితరులు వెంకటేష్‌ను పరామర్శించారు.

కోదండరామస్వామి ఆలయంలో గొట్టిపాటి ప్రత్యేక పూజలు

పంగులూరు, జనవరి 14: తూర్పుతక్కెళ్ళపాడు గ్రామంలోని శ్రీకోదండరామ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన ఆలయ అర్చకులు గొట్టిపాటిని ఆశీర్వదించి శాలువాతో సత్కరించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై దాడులు

వేటపాలెం(చీరాల), జనవరి 14: మండలంలోని విఘ్నేశ్వరకాలనీ, వివేకానంద కాలనీల్లో ఎస్సై సురేష్, సిబ్బందితో కలసి బెల్ట్‌షాపులపై ఆదివారం నిర్వహించిన దాడులలో 14 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీనివాసనగర్‌లో చోరీ

అద్దంకి, జనవరి 14: మండలంలోని చినకొత్తపల్లి పంచాయతీ శ్రీనివాసనగర్‌లో తాళాలు వేసి ఉన్న రెండు ఇళ్ళలో చోరీలు జరిగాయి. స్థానికుల కథనం మేరకు.. కొల్లా వెంకటరత్నమ్మ అద్దంకిలో కుమార్తె వద్ద ఉండటంతో ఇంటిని అద్దెకు ఇచ్చారు. నెల రోజుల క్రితం అద్దెకు ఉండే కుటుంబం ఖాళీ చేయటంతో ఇంటికి తాళాలు వేసి ఉంది. పక్క ఇంటిలో ఉండే నూతి భూలక్ష్మి వారం రోజుల క్రితం బళ్ళారిలో ఉన్న కుమారుడు వద్దకు వెళ్ళారు. ఈనేపథ్య ంలో గుర్తుతెలియని వ్యక్తులు రెండు ఇళ్లల తాళాలు పగుల కొట్టి చోరీకి పాల్పడ్డారు. కొల్లా వెంకటరత్నమ్మకు చెందిన ఇంట్లో ఏమి లేకపోవటంతో చోరీ జరగలేదు. భూలక్ష్మి ఇంట్లో బీరువాలో ఉన్న సుమారు రూ.20 వేల నగదు అపహరణ జరిగినట్లు తెలుస్తుంది. భూలక్ష్మి బళ్లారి నుండి వచ్చిన తరువాత పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉంది. వెంకటరత్నమ్మ ఆదివారం శ్రీనివాసనగర్‌కు వెళ్ళటం తో చోరీల విషయం బయటపడింది.

హోరాహోరీగా పొట్టేళ్ల పందేలు

బల్లికురవ, జనవరి 14: మండలంలోని మల్లాయపాలెం గ్రామంలో శ్రీకృష్ణ యాదవ్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పొట్టేళ్ల పందేలు జరిగాయి. ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల్లోని పలుగ్రామాల నుంచి 64 పొట్టేళ్లు పాల్గొన్నాయి. ఈ పోటీలను వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి ప్రారంభించారు. మేదరమెట్లకు చెందిన ఎం.రవి పొటేలు మొదటి స్థానంలో, పూరిమిట్లకు చెందిన కోనంకి శ్రీనివాసుల పొటేలు రెండో స్థానంలో నిలిచింది. లింగాపురంకు చెందిన గంజి రామకృష్ణ పొటేలు, పంగులూరుకు చెందిన నారంశెట్టి సుబ్బారావు పొటేలు మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి. వీటి యజమానులకు నగదు బహుమతులు అందజేశారు.

బైకు బోల్తా.. ఇద్దరికి తీవ్రగాయాలు

బల్లికురవ, జనవరి 14: మండల పరిధిలోని అద్దంకి బ్రాంచ్ కాలువ(ఏబీసీ) వల్లాపల్లి సమీపంలో శనివారం రాత్రి ప్రమాదవశాత్తు బైకు కాలువలోకి పడిపోయింది. ఈప్రమాదంలో ముండ్లమూరు మండలం వేంపాడుకు చెందిన సీహెచ్ చెన్నయ్య, జి.చినశివయ్యకు తీవ్రగాయాలయ్యాయి. అద్దంకి వైపు నుండి బల్లికురవకు వస్తుండగా కాలువ మలుపు అర్థకంకాక కాలువలోకి దూసుకుపోయింది. బైకుపై ఉన్న ఇద్దరు కాలువలో పడి రక్తం మడుగులో ఉండగా, బాటసారులు గమనించి 108కు సమాచారం అందించారు. అద్దంకి నుంచి వచ్చిన 108 సిబ్బంది ప్రథమ చికిత్స అందించి ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

గంగవరంలో 120 మందికి వైద్య సేవలు

ఇంకొల్లు, జనవరి 14: మండలంలోని గంగవరం గ్రామంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ రమేష్‌కుమార్, డాక్టర్ సాంబశివరావు, మణిదీప్, హారిక, శ్వేతశ్రీ, రాజేంద్ర రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గంగవరం ఎస్‌వీకే ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌కు రూ.లక్ష విరాళం అందజేసిన దాత ఉమేశ్‌చంద్రను పలువురు అభినందించారు. కార్యక్రమంలో వలేటి కృష్ణయ్య, ఏలూరి సిద్ధయ్య, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

నక్కలపాలెంలో చంద్రన్న కానుక అందజేత

ఇంకొల్లు, జనవరి 14: మండలంలోని నక్కలపాలెం గ్రామంలో సంక్రాంతి సందర్భంగా చంద్రన్న, ఏలూరి బీసీ కానుక అందజేశారు. నక్కలపాలెం తెలుగు యువత ఆదివారం ఆదివారం గ్రామంలో వీటిని అందజేశారు. కార్యక్రమంలో జాగర్లమూడి రామాంజనేయులు, చిలుకూరి అజిత్, బాచిన శ్రీకాంత్, సాయి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

అద్దంకి, జనవరి 14: ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాణెం హనిమిరెడ్డి అన్నారు. మండలంలోని వేలమూరిపాడు, ధేనువకొండ పునరావాసకాలనీలలో ఆదివారం సాయంత్రం పర్యటించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అద్దంకి పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో మాలమహానాడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో హనిమిరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమాలలో వైసీపీ అద్దంకి పట్టణ, మండల అధ్యక్షులు కాకాని రాధాకృష్ణమూర్తి, గుజ్జుల జగన్మోహనరెడ్డి, అవిశన ప్రభాకరరెడ్డి, రామిరెడ్డి ఆదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం

చినగంజాం, జనవరి 14: చినగంజాం భూసమేత భావనారాయణస్వామి, కడవకుదురు సీతాలక్ష్మణ్ హనుమత్ సమేత కోదండరామస్వామి ఆలయాల్లో రంగనాయకస్వామి, గోదాదేవిల కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ధనుర్మాసంలో నిర్వహించే కల్యాణోత్సవంలో భాగంగా కోదండరామస్వామి ఆలయంలో, భావనారాయణస్వామి కల్యాణ మండపంలో భోగి పండుగను పురస్కరించుకుని గోదాదేవి సమేత రంగనాథుని కల్యాణాన్ని జరిపారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. గత నెల రోజులుగా ధనుర్మాసం సందర్భంగా మహిళాల భక్తులు నిర్వహిస్తున్న తిరుప్పావై పారాయణం ఆదివారం ముగిసింది.

ఎస్మా ప్రయోగించినా తగ్గేదేలేదు!



ఎస్మా జీవోలను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

చినగంజాం, జనవరి 14: ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించినా తగ్గేదే లేదని, సంక్రాంతి తరువాత ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అంగన్‌వాడీ, ఇంకొల్లు ప్రాజెక్టు నాయకురాలు ఎ.హైమావతి హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మె ఆదివారం 34వ రోజుకు చేరింది. భోగి మంటల్లో ఎస్మా చట్టం జీవోలను దహనం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ మండల నాయకులు కె.రంగనాయకమ్మ, జయ లక్ష్మి, యానాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బల్లికురవ: అంగన్‌వాడీపై ప్రభుత్వం మొండివైఖరిని వీడనాడాలని కార్యకర్తలు భోగి మంటలలో ప్రభుత్వం తెచ్చిన జీవో కాపీలను దహనం చేశారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నారులకు భోగి పండ్లు పోసి నిరసన తెలిపారు. కార్యక్రమాలలో సంఘ నేతలు నాగమణి, శ్రీదేవి, సరస్వతి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్: తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారానికి 34వ రోజుకు చేరుకుంది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎస్మా చట్టం జీవో నెంబర్ 2 ప్రతులను భోగి మంటలలో వేసి దహనం చేశారు. కార్యక్రమంలో తంగిరాల వెంకటేశ్వర్లు, జి.శారద, మనోలత, రావమ్మ పాలొన్నారు.

మార్టూరు: తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు ఆదివారం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మజుందార్ సంఘీభావం తెలిపారు. మండల కాంప్లెక్స్ వద్ద జరుగుతున్న దీక్షా శిబిరాన్ని సందర్శించారు. ఆయన వెంట జిల్లా నాయకుడు బత్తుల హనుమంతరావు ఉన్నారు.

భోగి మంటల్లో జీవో ప్రతుల దహనం



భోగి మంటల్లో చీకటి జీవోలను దహనం చేస్తున్న టీడీపీ శ్రేణులు

కొత్తపేట(చీరాల), జనవరి 14: స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద ఆపార్టీ శ్రేణులు ఆదివారం భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని సంప్రదాయబద్ధంగా భోగి మంటలువేసి సందడి చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ భోగి మంటల్లో ప్రభుత్వ చీకటి జీవోల ప్రతులనువేసి దహనం చేశారు. అందరి జీవితాల్లో వెలుగులు నిండాలని, వైసీపీ ప్రభుత్వం పతనం కావాలని ఈ సందర్భంగా నాయకులు అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎం.గౌరీఅమర్‌నాథ్, కర్పూరపు సుబ్బలక్ష్మి, కౌతవరపు జనార్దనరావు, గజవల్లి శ్రీనివాసరావు, డేటా నాగేశ్వరరావు, గంజి పురుషోత్తమ్, అడ్డగడ్డ రామయ్య, తేలప్రోలు నాగేశ్వరరావు, కుంచాల రామాంజనేయులు, నరాల తిరుపతిరాయుడు, బిట్రా చైతన్య పల్లగొర్ల బాలసుబ్రమణ్యం, పావులూరి రవీంద్ర, షేక్ బాషా, షేక్ అలీమ్ పాల్గొన్నారు.

చీరాల ఎన్ఆర్‌పీఎం హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సంక్రాంతి సంబరాలలో భాగంగా భోగి మంటలువేసి సందడి చేశారు. గంగిరెద్దులతో కనువిందు చేశారు. సంప్రదాయాలు ఉట్టిపడేవిధంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, వాకర్స్ పాల్గొన్నారు.

తెలుగుయువత ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

అద్దంకి, జనవరి 14: తెలుగుయువత అద్దంకి పట్టణ ఆధ్వర్యంలో ఆదివారం 5వ వార్డు పరిధి రాజీవ్‌కాలనీలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు పట్టణ తెలుగుయువత అధ్యక్షుడు వడ్డవల్లి పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు వడ్డవల్లి పూర్ణచంద్రరావు, పొన్నలూరి కిరణ్‌కుమార్, బాచిన సుబ్బారావు, వీరాంజి, పొత్తూరి శివకృష్ణ, రమణ, పాపారావు, మాగులూరి గోపి, చంద్రకుమారి, పార్వతి, ప్రమీల, కౌన్సిలర్‌లు రంగిశెట్టి సుభాషిణి, మాగులూరి తిరుపతమ్మ, కంపా రజనీ, జహీరా తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అద్దంకిటౌన్, జనవరి 14: అద్దంకిలోని శ్రీప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆదివారం 1981-82 సంవత్సర పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. సుమారు వంద మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఆనాటి ఉపాధ్యాయలను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులు, పిల్లలతో హాజరై ఆనందంగా గడిపారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

చినగంజాం, జనవరి 14: సంస్కృతి, సంప్రదాయలకు ప్రతీక సంక్రాంతి పండుగని గొనసపూడి సర్పంచ్ విక్రం దీప్తి, టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య అన్నారు. మండలంలోని గొనసపూడిలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని టీడీపీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు సర్పంచ్, టీడీపీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు విక్రం నారాయణ, బత్తుల శ్రీనివాసరావు, కొండ్రగుంట శ్రీహరి, టి.జయరావు, నక్కల వీరరాఘవులు, జరుబుల సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రోత్సాహకాలతో విద్యాభివృద్ధి

మేదరమెట్ల, జనవరి 14: విద్యార్థులకు ప్రోత్సహకాలను అందజేయడం ద్వారా వారిలో నైపుణ్యాలను పెంచవచ్చుని డాక్టర్ యలగాల గోపిచంద్ అన్నారు. ఆదివారం రావినూతల జడ్పీ ఉన్నత పాఠశాలలో యలగాల సుబ్బరావు స్మారక ప్రతిభా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు నగదు పురస్కారాలను అందజేశారు. ఈ బహుమతులను తండ్రి సుబ్బారావు జ్ఞాపకార్థం కుమారుడు గోపిచంద్ అందజేశారు. కార్యక్రమంలో చీరాల ఉప విద్యాశాఖాధికారి ఆర్.శ్రీనివాసరావు, మోపర్తి వెంకట్రావు, హెచ్ఎం రామాంజనేయులు, పూనాటి హరిబాబు, కేమా శ్రీనివాసరావు, కేఎల్ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన



మాట్లాడుతున్న జనసేన రాష్ట్ర కార్యదర్శి ఆమంచి స్వాములు

పర్చూరు, జనవరి 14: రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆమంచి స్వాములు అన్నారు. ఆదివారం పర్చూరులో జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు షేక్ రియాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెదపూడి విజయ్ కుమార్, ఈదర హరిబాబు హాజరయ్యారు. తొలుత స్థానిక బొమ్మల సెంటర్‌లో పార్టీ జండాను ఆవిష్కరించి, వంగవీటి మోహన్‌రంగా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ర్యాలీగా శ్రీఅద్దంకి నాంచారమ్మ అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో ఏర్పాటుచేసిన సభాస్థలానికి చేరుకున్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి, అసమర్థ, అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేలా ప్రతిఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, జిల్లా కార్యదర్శి రమేష్, శంకరశెట్టి చిరంజీవి, రావూరి బాలాజీ, ఎన్ఆర్ఐ మన్నెం శ్రీకాంత్ పెంట్యాల బాలాజీ, అజయ్ కుమార్, కె.పవన్, కారంపూడి తేజ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలకు ప్రతిరూపాలు.. నాటికల ప్రదర్శనలు



కపిరాజు నాటికలోని ఓ సన్నివేశం

యద్దనపూడి(మార్టూరు), జనవరి 14: ప్రజల సమస్యలను కళాకారులు కళా పరిషత్ లద్వారా వెలుగులోకి తీసుకువస్తున్నారని, ప్రజలను ఆలోచింపచేసే నాటికలు సమాజంలో మార్పును తీసుకురావాలని ప్రముఖనవలా రచయిత్రి చంద్రలత అన్నారు. యద్దనపూడి మండలంలోని అనంతవరం గ్రామంలో నాల్గవ రోజు ఆదివారం రాత్రి ఎన్టీఆర్ కళాపరిషత్ నాటికలను ప్రదర్శించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన చిలకలూరిపేట మాజీ ఎమ్మెల్యే కందిమళ్ల జయమ్మ నటరాజ విగ్రహానికి జ్యోతి ప్రజ్వలన చేయగా, ఆహుతులను కందిమళ్ల సాంబశివరావు వేదికపైకి ఆహ్వానించారు. సభకు నవ్యాంధ్ర రచయిత్రుల గౌరవ అధ్యక్షురాలు తేళ్ల అరుణ అధ్యక్షత వహించగా, ప్రముఖ నవలా రచయిత్రి చంద్రలతను సత్కరించారు. కార్యక్రమంలో కళాపరిషత్ అధ్యక్షుడు గుదే పాండురంగారావు, గుదే తారక రామారావు, నిమ్మల సాంబశివరావు, పెదవల్లి కల్యాణ చక్రవర్తి, పెదవల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అనంతరం మూడు నాటికలను ప్రదర్శించారు. న్యూ స్టార్ మోడరన్ థియేటర్ ఆర్ట్స్ విజయవాడ వారు ప్రదర్శించిన కపిరాజు నాటికను, శ్రీకారం రోటరీ కళా పరిషత్ మార్టూరు వారు రైతు భారతం నాటికను, రసఝురి పొన్నూరు వారిచే కాపలా నాటికను ప్రదర్శించారు. సోమవారం జరిగే కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా సినీ దర్శకులు అనిల్ రావిపూడి, గోపీచంద్ మలినేని, సినీ నటుడు అజయ్ ఘోష్ పాల్గొంటారు.

ఆలోచన రేకెత్తిస్తున్న నాటికల పోటీలు

వీరన్నపాలెం(పర్చూరు), జనవరి 14: పర్చూరు మండలం వీరన్నపాలెం గ్రామంలో కళానికేతన్ కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ఆలోచన రేకెత్తించే విధంగా సాగుతున్నాయి. ఈపోటీలను గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కళాపరిషత్ గౌరవాధ్యక్షుడు గోరంట్ల రమేష్‌బాబు సారథ్యంలో పోటీలను శనివారం రాత్రి ప్రారంభించారు. ఆదివారం ప్రదర్శించిన మూల్యం నాటిక ప్రేక్షకులను ఆలోచింప జేసింది. నేటి సమాజంలో ఆడపిల్లల మీద అడుగడుగునా విధించబడుతున్న ఆంక్షలు, వివాహం అయిన తరువాత కూడా ఆమె పడుతున్న బాధలను దర్శకుడు వెంకట్ గోవాడ మూల్యం నాటిక ద్వారా చూపారు.

ఉత్సాహంగా ఎడ్ల బలప్రదర్శన

అన్నంబొట్లవారిపాలెం(పర్చూరు), జనవరి 14: సంక్రాంతి సంబరాల్లో భాగాంగా పర్చూరు మండలం అన్నంబొట్లంవారిపాలెంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఆదివారం నాలుగుపళ్ళ విభాగంలో నిర్వహించిన పోటీలలో 12జతల ఎడ్లు పాల్గొన్నాయి. తొలుత బరిలోకి దిగిన పర్చూరు మండలం కొల్లావారిపాలెం గ్రామానికి చెందిన ఎడ్లు నిర్ణీత సమయం ముగిసే సరికి 3600.11 అడుగుల దూరం లాగాయి. గుంటూరు జిల్లా, సత్తెనపల్లి మండలం, అబ్బినగుంటపాలెంకు చెందిన ఎడ్ల జత నిర్ణీత సమయం ముగిసే సరికి 3934.10 అడుగుల దూరం లాగాయి.

గుంటురు జిల్లా క్రోసూరు మండలం, బయ్యారంకు చెందిన ఎడ్లు 4078.9 అడుగులు, ప్రకాశం జిల్లా, ఎర్రగొంపాలెం మండలం, వైకొత్తపల్లి గ్రామానికి చెందిన ఎడ్లు 4500 అడుగుల దూరం లాగాయి. తరువాత పోటీలోకి దిగిన గుంటూరు జిల్లా, పెద్దకాకానికి చెందిన ఎడ్ల జత నిర్ణీత సమయం ముగిసే సరికి 4800 అడుగుల దూరం లాగి ప్రస్తుత పోటీల్లో ముందంజలో ఉన్నాయి. యువకులు, పెద్దల కేరింతలు, ఈలల మధ్య పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా నిర్వహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

మార్టూరు, జనవరి 14: మార్టూరు గ్రామ పంచాయతీలోని గొట్టిపాటి నగర్‌లో ఉమ్మిడిశెట్టి రవికుమార్ (35) అనే వ్యక్తి ఇంటిలో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. ప్రకాశం జిల్లా కంభంకు చెందిన రవికుమార్ రెండేళ్ల నుంచి మండలంలోని రాజుగారిపాలెంకు చెందిన ఒక వివాహితతో సహజీవనం చేస్తూ గొట్టిపాటి నగర్‌లో నివాసం ఉంటున్నారు. వారిమధ్య ఏం జరిగిందో తెలియదు గాని సాయంత్రం అతను ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు మార్టూరులో పెయింట్ పనులకు వెళుతుంటాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సెమీస్‌కు చేరిన చెన్నై జట్లు



శ్రీసీసీ చెన్నై, తిరుపతి జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్

మేదరమెట్ల, జనవరి 14: రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీభమర సంక్రాంతి కప్ 2024 క్రికెట్ పోటీలలో చెన్నైకు చెందిన జట్లు ప్రతిభ చూపాయి. ఆదివారం జరిగిన పోటీలలో శ్రీసీసీ చెన్నై జట్టు, తండర్ బోల్ట్ తిరుపతి జట్టుపై విజయం సాధించింది. సాయంత్రం జరిగిన పోటీలో ప్రసాద్ జెడ్‌ఫోర్స్ హైదరాబాద్ జట్టుపై జీఎస్టీ సెంట్రల్ ఎక్సైజ్ చెన్నై జట్టు విజయం సాధించింది. గెలుపొందిన రెండు జట్లు సెమీస్‌కు చేరాయి.


ఉదయం శ్రీసీసీ చెన్నై, తండర్‌బోల్ట్ తిరుపతికి మధ్య జరిగిన పోటీలలో శ్రీసీసీ జట్టు తొలుత బ్యాటింగ్ చేసి నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 123 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తండర్‌బోల్ట్ తిరుపతి జట్టు 11.3 ఓవర్లలో 44 పరుగులకు ఆలౌట్ అయింది. సాయంత్రం జరిగిన మ్యాచ్‌లో ప్రసాద్ జెడ్‌ఫోర్స్ హైదరాబాద్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 141 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్ ఎక్సైజ్ చెన్నై జట్టు 16.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 142 పరుగులు చేసి గెలుపొందింది.

సోమవారం శ్రీసీసీ చెన్నై, సిక్సోల్ సితాస్ వైజాగ్ జట్టు మధ్య పోటీ జరగనుంది. సాయంత్రం జీఎస్ఎస్ అండ్ సెంట్రల్ ఎ క్సైజ్ చెన్నై, సౌత్ జోన్‌సీసీ చెన్నై జట్ల మధ్య పోటీ జరుగుతుందని ఆర్ఎస్‌సీఏ అధ్యక్ష, కార్యదర్శులు కారుసాల నాగేశ్వరరావు, యడ్లపల్లి నరసింహారావు తెలిపారు. మంగళ వారం జరిగే ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే గొట్టిపాటి రవి కుమా ర్, మాజీ ఎంపీ శ్రీరామ్ మాల్యాద్రి, సినీనటుడు రఘుబాబు, భ్రమర ఎండీ రాయ చంద్రరావు హాజరవుతున్నట్టు అసోసియేషన్ కార్యదర్శి యడ్లపల్లి నరసింహారావు తెలిపారు.

కొండమంజులూరులో ఆసక్తికరంగా క్రికెట్ పోటీలు

పంగులూరు, జనవరి 14: మండలంలోని కొండమంజులూరులో టీ 20 ప్రీమియం లీగ్ జాతీయస్థాయి క్రికెట్ పోటీలు ఆసక్తికరంగా జరుగుతున్నాయి. ఆదివారం జరిగిన పోటీలలో సిక్కోలు చేతాస్ శ్రీకాకుళం, లెవెన్ బ్రదర్స్ సీసీ కామారెడ్డి జట్లు సెమీస్‌కు చేరాయి. ఉదయం జరిగిన పోటీలో ప్రతిభ సీసీ కేరళ జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ చేసిన శ్రీకాకుళం జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 220 పరుగులు చేసింది. 221 పరుగుల విజయ లక్ష్యంలో బ్యాటింగ్ చేపట్టిన కేరళ జట్టు 17.1 ఓవర్లకే 146 పరుగులకు ఆలౌట్ అయి ఓటమి చెందింది. సాయంత్రం ఎంఆర్‌సీసీ చెన్నై, కామారెడ్డి జట్ల మధ్య జరిగిన పోటీలో టాస్ గెలిచిన చెన్నై జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 16.3 ఓవర్లలో 89 పరుగులకు ఆలౌట్ అయింది. 90 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన కామారెడ్డి జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 90 పరుగులు సాధించి సెమీస్‌కు చేరింది.

సోమవారం జరిగే సెమీస్‌లో ఉదయం బళ్ళారి, లెవెన్‌బ్రదర్స్ కామారెడ్డి జట్లు, సాయంత్రం జార్ఖండ్, శ్రీకాకుళం జట్లు తలపడనున్నట్టు నిర్వాహకులు కరణం స్వామి తెలిపారు.




నెల్లూరులో ఆదివారం తెల్లవారుజామున భోగి మంట వేస్తున్న నగరవాసులు



ఊరూరా సంబరం!

చిన్నారులకు భోగిపండ్లతో దీవెన
కనుల పండువగా గోదా కల్యాణం
నేడు సంక్రాంతి పర్వదినం

- ఉత్సాహంగా భోగభాగ్యాల భోగి
- బంధుమిత్రులతో పల్లెలు కళకళ


కోవూరులో ఉత్సాహంగా సాగిన ఎడ్ల పందేలు

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 14 : భోగి పండుగను జిల్లావాసులు ఉత్సాహంగా జరుపుకున్నారు. శనివారం అర్ధరాత్రి నుంచే వాణిజ్య సముదాయాలు, ప్రధాన కూడళ్లు, ఇళ్ల ముందు మంటలు వేశారు. కార్యాలయాలు, ఇళ్లలోని పాత వస్తువులను భోగి మంటల్లో వేసి నూతన వస్తువులతో సంక్రాంతికి స్వాగతం పలికారు. మంటల కాంతికి వీధులన్నీ దగదగలాడాయి. ఉదయం మహిళలు ఇళ్ల ముంగిట రంగవల్లులను అందంగా తీర్చిదిద్ది పండుగ శోభను తెచ్చారు. ఉదయం భోగి స్నానాలు చేసి నూతన వస్త్రాలు ధరించి తమ ఇష్టదైవాలకు పూజలు చేశారు. నాటుకోడి, దోశలను అల్పాహారంగా తీసుకున్నారు. బంధుమిత్రుల రాకతో పల్లెల్లో సందడి వాతావరణం నెలకొంది. వివిధ రంగాల ప్రముఖులు, రాజకీయ నేతలు స్వగ్రా మాలకు చేరుకుని సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు. సాయంత్రం భోగి భాగ్యాలు తమ వారసులకు అందాలని ఆకాంక్షిస్తూ ఐదేళ్లలోపు చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. ముత్తయిదువులు గొబ్బినోములకు శ్రీకారం చుట్టి బొమ్మల కొలువులు ఏర్పాటు చేసుకొని గొబ్బి గౌరమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు. మరోవైపు అన్ని వైష్ణవ ఆలయాల్లో గోదా కల్యాణాలు వేడుకగా జరిగాయి.

నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో ఉదయం గోదాదేవి (అండాళ్) అమ్మవారికి శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామికి తిరుమంజనం సేవలు జరిగాయి. సాయంత్రం (అండాళ్) గోదాదేవికి తల్పగిరి రంగనాథస్వామికి ఎదురుకోలు ఉత్సవం నయనానందకరంగా జరిగింది. ఈ సందర్భంగా కల్యాణ మాలల మార్పిడి ఘట్టం మరింత ఆకట్టుకుంది. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామికి గోదాదేవకి కల్యాణం కనులపండువగా జరిగింది. ఇక పెంచలకోన క్షేత్రంలో గోదాదేవి క్షేత్రోత్సవం అట్టహాసంగా జరిగింది. సోమవారం సంక్రాంతి పండుగను జిల్లావాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. పొంగళ్లు పొంగించి పెద్దలకు నూతన వస్త్రాలు పెట్టి పూజలు చేయనున్నారు. సంక్రాంతి అంటే పతంగులు పండుగ. చిన్నా పెద్దా తేడా లేకుండా పతంగులు ఎగరవేయనున్నారు. సాయంత్రం బోడిగాడితోటలో పెద్దల పండుగ జరగనుండగా, నగర పాలక సంస్థ భారీ ఏర్పాట్లు చేసింది. తమ పూర్వీకుల సమాధులను కుటుంబ సభ్యులు అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేయనున్నారు.


నెల్లూరు : శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథుడికి గోదాదేవికి జరిగిన కల్యాణం


హైటెక్ హరిదాసండీ : లింగసముద్రంలో బైక్‌పై వచ్చిన హరిదాసుకు దానం చేస్తున్న బాలిక


కావలిలో పిల్లలపై భోగి పండ్లు పోస్తున్న పెద్దలు

కొనసాగుతున్న అంగన్వాడీల ఆందోళన

భోగి మంటల్లో నోటీసుల ప్రతుల దహనం


నెల్లూరు : భోగిమంటల్లో నోటీసులను దహనం చేస్తున్న నేతలు

పండుగ నాడూ పోరాటమే !



నెల్లూరు (వైద్యం), జనవరి 14 : ఊరూరా ప్రతి ఇంటా సంక్రాంతి సందడి నెలకొని ఉండగా, అంగన్వాడీలు మాత్రం తమ డిమాండ్ల సాధన కోసం సమ్మెలోనే కొనసాగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చే వరకు ఆందోళన విరమించేదిలేదని తేల్చి చెబుతున్నారు. తమకు అందజేసిన షోకాజ్ నోటీసుల ప్రతులను ఆదివారం ఉదయం అంగన్వాడీలు భోగి మంటల్లో వేసి నిరసన వ్యక్తం చేశారు. నగరంలోని ముత్తుకూరు గేటు సెంటర్‌లో సీఐటీయూ ఏర్పాటు చేసిన భోగి మంటల్లో ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం అనేక రూపాల్లో బెదిరింపు ధోరణులకు పాల్పడుతోందని మండిపడ్డారు. ఐదేళ్లకు ఒకసారి జీతాలు పెంచుతామని ప్రకటించడం సిగ్గుచేటని అన్నారు. ఈ నిరసనలో భవననిర్మాణ కార్మిక సంఘం నగర కార్యదర్శి శ్రీనివాసులు, నేతలు సుధాకర్, సంపూర్ణమ్మ, రాజా, మురళీ తదితరులు పాల్గొన్నారు. కావలి, కందుకూరు తదితర ప్రాంతాల్లోనూ ఆందోళనలు జరిగాయి.

కావలిలో..


కందుకూరులో..

చివరి దశకు ఓటర్ల జాబితా

- ముగిసిన క్లయిమ్స్ పరిష్కారం గడువు
- ఈనెల 22న ముసాయిదా ప్రచురణ

నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. స్పెషల్ సమ్మరీ రివిజన్-2023 ఓటర్ క్లయిమ్స్ పరిష్కారం గడువు ఈ నెల 12వ తేదీతో ముగిసింది. ఇక ఫైనల్ ఓటర్ల జాబితాను ప్రచురించడం మాత్రమే మిగిలింది. ఈ నెల 22న ఈ ముసాయిదాను ప్రచురించనున్నారు. గతేడాది అక్టోబరు 27న స్పెషల్ సమ్మరీ రివిజన్ ఆరంభమవగా, డిసెంబరు 9వ తేదీ వరకు ఫారమ్-6, 7, 8 దరఖాస్తులను స్వీకరించారు. మొదట అనుకున్న షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 26తో ఓటరు క్లయిమ్స్ పరిష్కరించి జనవరి 5న ఓటర్ల తుది జాబితా ప్రచురించాల్సి ఉంది. అయితే దరఖాస్తులు భారీగా రావడంతో స్పెషల్ సమ్మరీ రివిజన్ గడువు ఎన్నికల సంఘం ఈ నెల 22కు పొడిగించింది. అక్టోబరు 27 నుంచి ఫారమ్-6 దరఖాస్తులు 62,696 వచ్చాయి. అందులో 53,777 ఆమోదించగా, 8,914 దరఖాస్తులను తిరస్కరించారు. అలాగే ఫారమ్-7 దరఖాస్తులు 63,888 రాగా, 54,686 ఆమోదించి, 8,610ల ను తిరస్కరించారు. ఈనెల 9వ తేదీ నాటికి మరో 592 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక ఫార మ్-8 దరఖాస్తులు 73,102రాగా, 68,859 ఆమోదించారు. 2,652 తిరస్కరించగా, 1591 దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచారు. గతేడాది ఏప్రిల్ 15 నుంచి జిల్లాలో భారీగా ఫారమ్-7 (ఓట్ల తొలగింపు) దరఖాస్తులు అందాయి. అక్టోబరు 26వ తేదీ నాటికి 1,37,844 దరఖాస్తులు రాగా, ఆ తరువాత నుంచి ప్రారంభమైన స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో మరో 63,888 దరఖాస్తులు వచ్చాయి. ఇంత భారీస్థాయిలో ఫారమ్-7 దరఖాస్తులు అందడంతో ప్రతిపక్షాలు అనుమానాలు వ్యక్తం చేస్తూ వస్తున్నాయి. ఉద్దేశపూర్వకంగా అధికారపార్టీ నాయకుల తమ పార్టీ సానుభూతిపరుల ఓట్లను తొలగించేందుకు కుట్ర లు చేస్తున్నారంటూ టీడీపీ నేతలు అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో 32 వేల కుపైగా దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. అంటే వీరంతా బతికి ఉన్నా, స్థానికంగా ఉన్నప్పటికీ వారి ఓట్ల తొలగింపునకు దరఖాస్తులు అందాయి. ఇక ప్రతిపక్షాలు ఆరోపించినట్లుగానే అధికార పార్టీకి చెందిన కొందరు నేతల పేర్లతో భారీగా దరఖాస్తులు అందాయి. ఇలా ఉద్దేశపూర్వకంగా ఫారమ్-7 దరఖాస్తులు ఇచ్చిన ఏఎస్‌పేట, చేజ ర్ల మండలాల్లో కేసులు నమోదు చేశారు. ఇక ఈ నెల 22వ తేదీ న తుది జాబితాను ప్రచురిస్తే పూర్తి వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.

ఈ నెల 9నాటికి జిల్లాలోని ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
కందుకూరు	1,12,185	1,14,382	24	2,26,591
కావలి	1,14,919	1,19,088	28	2,34,035
ఆత్మకూరు	1,04,702	1,04,085	8	2,12,755
కోవూరు	1,26,194	1,34,708	20	2,60,922
నెల్లూరు సిటీ	1,16,033	1,21,354	71	2,37,458
నెల్లూరురూరల్	1,30,010	1,37,022	26	2,67,058
సర్వేపల్లి	1,11,463	1,17,578	30	2,29,071
ఉదయగిరి	1,18,411	1,20,035	13	2,38,459
మొత్తం	9,33,917	9,72,212	220	19,06,349





అభివృద్ధి చేసే నాయకులకే మద్దతు

వరికుంటపాడు, జనవరి 14: ఉదయగిరి ప్రాంతాన్ని అభివృద్ధి చేసే నాయకులకే రానున్న ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుందని మాజీ మంత్రి మాదాల జానకిరాం అనుచరులు ప్రకటించారు. ఆదివారం వరికుంటపాడులో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశంలో నిర్వాహకులు గొడుగులూరి మాలకొండ్రాయుడు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం పాటుపడే పార్టీ గెలుపునకు కృషి చేస్తామన్నారు. త్వరలోనే నియోజకవర్గంలోని వరికుంటపాడు, ఉదయగిరి, దుత్తలూరు మండలాల్లో మాదాల విగ్రహాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కొండాపురం మాజీ జడ్పీటీసీ దామా మహేష్ మాట్లాడుతూ ట్రస్టును సైతం ఏర్పాటుచేసి భవిష్యత్తు కార్యాచరణను వారం రోజుల్లో ప్రకటిస్తామన్నారు. తొలుత సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మద్దసాని వెంకటేశ్వరరావు, మాదాల రామచంద్ర, వడ్లమూడి నాగేంద్ర, వీర్నపాటి రామచంద్రమూర్తి, మాదాల తిమ్మయ్య, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొబ్బూరి వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.





వైభవంగా సంగమేశ్వరుడి చప్పర ఉత్సవం

సంగం, జనవరి 14: మండల కేంద్రమైన సంగంలో భోగి పండుగను పురస్కరించుకుని ఆదివారం సంగమేశ్వరస్వామి చప్పర ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకామాక్షీదేవి సమేత సంగమేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను చప్పరలో ఉంచి పూలతో అలంకరించారు. అనంతరం సంగం పురవీధులో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ పూజారి భక్తులకు తీర్థప్రసాదములు అందచేశారు.


సంగమేశ్వరస్వామికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా గోదాదేవి కల్యాణం

కలువాయి, జనవరి 14: భోగి పండుగ సందర్భంగా కలువాయి సమీపంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి రంగనాథస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. కలువాయికి చెందిన కామిశెట్టి వెంకటేశ్వర్లు దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణం తిలకించి తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు నరసయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

త్రిముఖ దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

సీతారామపురం, జనవరి 14: మండలంలోని సిద్దేశ్వరంలో ఘటిక సిద్దేశ్వర ఆలయంలో ఇష్టకామేశ్వరి, భైరవకోనలోని త్రిముఖ దుర్గాదేవికి ఆదివారం భోగి పళ్లతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఘటిక సిద్దేశ్వర ఆలయ అర్చకులు సిద్దయ్య, కాశయ్య మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా సిద్దేశ్వరునికి ప్రత్యేక అలంకరణతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు.



ఆటల పోటీల ప్రారంభం

ఉదయగిరి రూరల్ : కృష్ణారెడ్డిపల్లిలో ఆదివారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐల ఆధ్వర్యంలో క్రీడా పోటీలను సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య ప్రారంభించారు. ఈ పోటీలను కొండా రాజారెడ్డి, దేవసాని సుధాకర్‌రెడ్డి, దేవసాని శ్రీనివాసులరెడ్డి, కల్లూరి రవీంద్రారెడ్డి సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు.

యూటీఎఫ్ నేతల నిరసన

ఏఎస్ పేట, జనవరి 14: ఉపాధ్యాయులకు చెల్లించవలసిన బకాయిలను ప్రభుత్వం చెల్లించకుండా మాట తప్పినందుకు ఆదివారం ఏఎస్ పేటలో యూటీఎఫ్ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా భోగి మంటలలో ప్రభుత్వ హామీ పత్రాలను వేసి దహనం చేశారు. ప్రభుత్వ నిరంకుశ వైఖరి, అప్రజాస్వామ్య విధానాలకు నిరసనగా ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

కావలి, జనవరి14: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని టీడీపీ నేత కావ్య కృష్ణారెడ్డి తెలిపారు. ముసునూరులోని ఇందిరమ్మ కాలనీలో యువత నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ మానసిక ఉల్లాసంతోపాటు శరీర దారుఢ్యానికి, మనసును నియంత్రించుకోవటానికి క్రీడలు చాలా అవసరమన్నారు. క్రీడల ప్రోత్సాహానికి తన వంతు సహకారం అందిస్తానని ఆయన తెలిపారు.

క్రీడాభివృద్ధికి సహకారం

బిట్రగుంట: బిట్రగుంట ఫుట్‌బాల్ క్రీడాకారులకు దేశంలోనే గుర్తింపు ఉందని, స్థానిక క్రీడాకారులకు పీఎస్ఆర్ ట్రస్ట్ సహకారం ఉంటుందని ట్రస్టు వ్యవస్థాపకుడు పసుపులేటి. సుధాకర్ అన్నారు. బోగోలు మండలం ఇబ్రహీంపేటలోని రైల్వే క్రీడా మైదానంలో యంగ్‌లైన్స్ కమిటీ ఆధ్వర్యంలో లెజెండ్స్ ఫుట్‌బాల్ కప్ పోటీలు ఆదివారం జరిగాయి. క్రీడా ఉపాధ్యాయులు చౌడప్ప, లక్ష్మీనారాయణలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఒక్కరోజు జరిగిన పోటీలో నాలుగు జట్లు తలపడ్డాయి. చెన్నై జట్టు విన్నర్‌గా నిలిచింది. సాగర్ సెవెన్స్ జట్టు రన్నర్‌గా నిలిచింది. విజేతలకు బహుమతులు అందచేశారు.


కావలి : క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కావ్య కృష్ణారెడ్డి

యువత ఆధ్వర్యంలో మీట్ విత్ ద లీడర్స్

కందుకూరు : మండలంలోని మహదేవపురం గ్రామానికి చెందిన తెలుగు యువత ఆధ్వర్యంలో ఆదివారం మీట్ విత్ ద లీడర్స్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జీఎస్ఆర్ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే డాక్టరు దివి శివరాం, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల నుంచి బయటకు వెళ్లి వారంతా తమ గ్రామాల అభివృద్ధి, సేవా కార్యక్రమాలపై దృష్టి పెట్టాలన్నారు. మహదేవపురం గ్రామం మొదటి నుంచి టీడీపీకి కంచుకోట అని, రాబోయే ఎన్నికల్లో యువత నడుంబిగించి పార్టీ గెలుపుకోసం కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, గుళ్లా సుధాకర్, చిట్టా హరికృష్ణ, చిట్టా బాబూరావు, ఓరుగంటి రమణయ్య, ఓరుగంటి శేషారావు, ముప్పరాజు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.


వేదికపై ఇంటూరి నాగేశ్వరరావు, దివి శివరాం, కంచర్ల శ్రీకాంత్ తదితరులు

భోగి మంటల్లో ఎస్మా ప్రతుల దహనం

కావలిటౌన్ : సమ్మెలో భాగంగా ఆదివారం ఉదయం అంగన్‌వాడీలు ఎస్మా ప్రతులను భోగి మంటల్లో దహనం చేసి నిరసన తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నేతలు మాట్లాడుతూ సంక్రాంతి కూడా చేసుకోకుండా తమను రోడ్లపాలు చేసిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు రఘురావమ్మ, సుభాషిణీ, విజయలత, వజ్రమ్మ, బిందు, సీఐటీయు నేతలు పెంచలయ్య, మధుసూదనరావు, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : అంగన్‌వాడీలు ఆదివారం ఎస్మా కాపీలను భోగిమంటల్లో వేసి దహనం చేశారు. స్థానిక అర్బన్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఉన్న శిబిరం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా శిబిరం వద్ద ముగ్గులు వేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ప్రభావతి, కృష్ణవేణి, శశికళ, నిర్మల, రాజేశ్వరి, సుభాషిణి, సుజాత, సీఐటీయూ నాయకులు ఎస్ఏ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

చీకటి జీవోల ప్రతులు దహనం

కావలి : వైసీపీ తెచ్చిన చీకటి జీవోలను భోగి మంటలో వేసి ఆదివారం టీడీపీ కార్యాలయం వద్ద తెలుగు తమ్ముళ్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలను వీధులలోకి తీసుకు వచ్చి ఇబ్బందులు పెట్టారన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబుని గెలిపించుకోవాల్సిన బాధ్య త మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మన్నవ రవిచంద్ర, గుత్తి కొండ కిషోర్, మొగిలి కల్లయ్య, జ్యోతి బాబూరావు, బొట్లగుంట శ్రీహరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కానుకలు ఇవ్వకపోవడంపై ధర్నా

బిట్రగుంట : పేదలకు పండుగ కానుకలు ఇవ్వకపోవడం అన్యాయమని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి అన్నారు. బోగోలులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత, గిరిజన, మైనార్టీలు ఆదివారం ధర్నా చేశారు. పండుగలకు కానుకలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జ్యోతి రాఘవులు, నాటకరాణి వెంకటాద్రి, పీ ఫిలిప్, దుగ్గిరాల తిరువళ్ళూరు, మల్లికార్జున, రఫ్రారాల్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు సామగ్రి పంపిణీ

కందుకూరు : స్థానిక కోవూరు రోడ్డులోని స్వయంకృషి మానసిక దివ్యాంగుల పాఠశాలకు భారత యువ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం వస్తు సామగ్రి అందచేశారు. రూ. 54,700 విలువ చేసే కుర్చీలు, వాటర్ డిస్పెన్సర్, నిత్యావసర వస్తువులు, పిల్లలకు స్నాక్స్ అందించినట్లు ఆర్గనైజర్ బెల్లం మనోజర్ తెలిపారు. కార్యక్రమంలో పీ శివకుమార్, టీ పృథ్వీరాజ్, డీ ప్రవీణ్, పీ సాయి తరుణ్, సంగ గోవర్ధన్, దుంప విష్ణు, పాఠశాల కరస్పాండెంట్ ఎస్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోదండరాముడికి ప్రత్యేక పూజలు

కందుకూరు: స్థానిక రెవెన్యూ కాలనీలోని కోదండరామాలయంలో ఆదివారం ధనుర్మాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గుంటూరి శ్రీనివాసమూర్తి స్వామి వారికి విశేష అలంకారం, పూజాదికాలు నిర్వ హించారు. అనంతరం అయోధ్య నుంచి వచ్చిన అక్షితలు, భవ్యరామ మందిర చిత్రపటాన్ని భక్తులకు అందచేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మన్నేపల్లి వరప్రసాదరావు, నాయకులు జమ్మలమడక సుబ్రహ్మణ్యం, దత్తు జోగేంద్ర పాల్గొన్నారు.

జలదంకిలో రక్తదాన శిబిరం

జలదంకి : ప్రతి ఏటా భోగిరోజున జలదంకి జెమ్స్, ఐకేర్ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రక్తదానం శిబిరాన్ని ఆదివారం పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించారు. ఐకేర్ మిషన్ అధ్యక్షుడు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో 24మంది యువకులు రక్తదానం చేశారు. . కావలి రెడ్‌క్రాస్ సిబ్బంది దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి వాకా హజరత్‌రెడ్డి, పవన్, వేణు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు మిఠాయిల పంపిణీ

కొండాపురం : మండలంలోని కొమ్మి గ్రామంలో కోడె వెంకటరావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 52 ముస్లిం కుటుంబాలకు ట్రస్టు వ్యవస్థాపక చైర్మన్ చెరుకూరు వెకటాద్రి ఆదివారం స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల మతాలకు తావు లేకుండా కోడె చారిటబుల్ ట్రస్టు ద్వారా సేవలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు సీహెచ్ రమణయ్య, యోనా, టీడీపీ నాయకులు సీహెచ్.నవీన్, సీహెచ్. శేషయ్య, షేక్ ఖాసిం, రామమూర్తి, బాదుల్లా పాల్గొన్నారు.

కోడి పందెంరాయుళ్ల అరెస్టు

లింగసముద్రం : మండలంలోని అన్నెబోయినపల్లిలో కోడి పందేలు ఆడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. అందిన సమాచారం మేరకు ఆదివారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని పొలాల్లో కోడి పందేలు ఆడుతున్న ముగ్గురిని ఎస్ఐ ఎం బాజీబాబు అదుపులోకి తీసుకొని, వారి నుంచి మూడు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

నేలటూరులో వికసిత్ భారత్

ఉదయగిరి రూరల్, జనవరి 14: మండలంలోని నేలటూరు గ్రామ సచివాలయ పరిధిలో ఆదివారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఈశ్వరమ్మ మాట్లాడుతూ ప్రజలు కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు.

శకునాలపల్లిలో వీధి దీపాల ఏర్పాటు

ఉదయగిరి రూరల్, జనవరి 14: మండలంలోని శకునాలపల్లి పంచాయతీలో సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పంచాయతీ సిబ్బంది నూతన వీధి దీపాలను ఏర్పాటు చేశారు. పంచాయతీలోని కుర్రపల్లి, యర్రబల్లిగడ్డ, బోడబండ, శకునాలపల్లి గ్రామాలతోపాటు ఎస్సీ, బీసీ కాలనీలో వీధిదీపాలు ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కరీముల్లా, సిబ్బంది పాల్గొన్నారు.









